**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 63, పేజీలు - 08

ఆదివారం, ఆగష్టు 30, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

## క్లెయిమ్స్, అభ్యంతరాల గడువును పొడిగించండి

**- ఎస్ఐఆర్ పై ఈసీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ**

**- తెలంగాణలో 92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి**

**- అర్హులైన వారు ఓటు కోల్పోకుండా సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం**

**- ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భారత ఎన్నికల సంఘం (ఈసీ) ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్‌కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించినట్లు ముఖ్యమంత్రి ఈసీ గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని సీఎం రేవంత్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

### సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం

మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయబడలేదని సీఎం రేవంత్ రెడ్డి లేఖలో తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు.

2లో..

## మోడీ కేబినెట్లో రిజర్వేషన్ల చిచ్చు!

**- మంత్రుల రాజీనామా సవాళ్లు**





న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ( యూజీసీ) విశ్వవిద్యాలయాల్లో కుల వివక్ష రూపుమాపేందుకు తీసుకొచ్చిన కొత్త నిబంధనలు దేశంలో రిజర్వేషన్ల తేనెతుట్టెను మళ్లీ కదిపాయి. ఇప్పటికే యూనివర్శిటీల్లో ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రక్షణలను బీసీలకు సైతం వర్తింపజేస్తూ యూజీసీ తెచ్చిన రూల్స్ ను అగ్రవర్ణాలు వ్యతిరేకించడం ప్రారంభించాయి. ఇది కాస్తా రిజర్వేషన్ హఠావో ఆందోళన్ పేరుతో అగ్రవర్ణాలు నిరసనలు చేసే వరకూ వెళ్లింది. వీటి వెనుక కేంద్రం ఉందన్న ప్రచారం నేపథ్యంలో ఆందోళనకారులతో చర్చలు

2లో..

## రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరగాలి

**- తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు తప్పనిసరి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో తప్పనిసరిగా స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పే విధానానికి స్వస్తి పలకాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని

2లో..

## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు

**- మందులు, రక్త నమూనాల రవాణాకు డ్రోన్ల వినియోగం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు వైద్య సేవలను వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించుకోనుంది. డ్రోన్ల ద్వారా మందులు, వైద్య పరికరాలను సరఫరా చేసే బృహత్తర ప్రాజెక్టును త్వరలో విస్తృతం చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

2లో..

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం

**- రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం**

**- మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు**

**- ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం**



అమరావతి (ప్రశ్న న్యూస్) అల్లూరి జిల్లా అరకు లోయ నియోజకవర్గం గన్నెలిలో సంజీవని కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం అక్కడ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మారుమూల ప్రాంతాల ప్రజలు కూడా వైద్యం అందక ఇబ్బంది పడకూడదని అన్నారు. అందుకే ఇప్పుడు ప్రారంభించిన సంజీవని కార్యక్రమం దేశంలోనే గేమ్ ఛేంజర్‌గా మారుతుందని ఆకాంక్షించారు. కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన దుస్థితి రాకుండా ఉండేందుకు సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గం సహా చిత్తూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు తెలిపారు. సంజీవని కార్యక్రమం రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని పేర్కొన్నారు.గతంలోనే ఆయుర్వేద వైద్యాన్ని గిరిజనులకు అల్లూరి సీతారామరాజు అందించారని, అలాంటి మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకు కొత్తగా నిర్మించిన ఎయిర్ పోర్టుకు అల్లూరి పేరు పెట్టామన్నారు చంద్రబాబు. థింసా డాన్సుతో గిరిజన బిడ్డలు గిన్నీస్ వరల్డ్ రికార్డును కూడా సృష్టించారని అభినందించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి

2లో..

## పకడ్బందీగా 'సర్' నోటీసులు

**- కలెక్టర్లతో తెలంగాణ సీఈవో సమీక్ష**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీని అత్యంత నిక్కచ్చిగా, ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు అందజేయాలని ఆయన స్పష్టం చేశారు. విచారణ జరిగే ప్రదేశం, తేదీ, సమయానికి సంబంధించిన వివరాలను కనీసం రెండు రోజుల ముందే ఓటరుకు తెలియజేయాలని నిర్దేశించారు. నోటీసు అందిన ఏడు రోజుల్లోగా వివరణ సమర్పించాలనే నిబంధనను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, విచారణ,

2లో..




## 22ఏ భూముల సమస్యలపై పోరుబాట

**- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో బీజేపీ చీఫ్ భేటీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

## అప్పీల్ లేకుండా శిక్ష పెంచడం చట్టవిరుద్ధం

**- మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేస్తూ సుప్రీం సంచలన నిర్ణయం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఒక కేసులో బాధితులు, ఫిర్యాదుదారు లేదా ప్రభుత్వం అధికారికంగా అప్పీల్ చేయకుండా అప్పీలేట్ కోర్టు స్వయంగా నిందితుడు లేదా నేరస్థుడి శిక్షను పెంచడానికి వీల్లేదని దేశ అత్యున్నత నాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కాలికట్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, ఆయన భార్య, వారి సెక్యూరిటీ గార్డ్‌ను దారుణంగా హత్య చేసిన తీవ్రమైన ట్రిబుల్ మర్డర్ కేసు విచారణ సందర్భంలో సుప్రీంకోర్టు ఈ కీలకమైన వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ మనోజ్ మిశ్రా,

2లో..


## వడివడిగా అడుగులు

**- ఓల్డ్‌సిటీ మెట్రో పనులు వేగవంతం**

**- 833 ఆస్తుల స్వాధీనం పూర్తి**

**- త్వరలోనే మిగిలిన ఆస్తుల స్వాధీనం**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ పాతనగరం మెట్రో రైలు విస్తరణ పనులనుమరింత వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. మెట్రో కారిడార్ నిర్మాణానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి భూసేకరణ, ఆస్తుల తొలగింపు, యుటిలిటీల తరలింపు పనులను త్వరగా పూర్తి చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్), హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ( హెచ్ఏఎంఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి ఆదేశించారు. ఇవాళ ఆయన ఓల్డ్‌సిటీలో దారుషిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెట్రో రైల్ చీఫ్ ఇంజినీర్ ఎస్.భాస్కర్‌రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఈ కారిడార్ అభివృద్ధికి మొత్తం 888 ప్రభావిత ఆస్తులను గుర్తించగా.. ఇప్పటివరకు 833 ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వివరించారు. మిగిలిన 55 ఆస్తులకు సంబంధించి వారసత్వ కట్టడాలు, పురాతన భవనాలు ఉండటంతో వాటి విషయంలో

2లో..

## తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం

**- పెన్షన్‌తో పాటు హెల్త్ కార్డులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు రేవంత్ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలిసింది. స్థలంతో పాటు చేయూత లబ్ధిదారులకు ఇస్తున్న మాదిరిగా నెలనెలా పెన్షన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్లు ఉద్యమకారుల గుర్తింపు కమిటీ వెల్లడించింది. కమిటీ సభ్యులు కేశవరావు, కోదండరామ్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితరులు సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన

2లో..

## క్లెయిమ్స్, అభ్యంతరాల గడువును పొడిగించండి

ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### అక్టోబర్ 19 వరకు గడువు పెంచండి

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

### మూడు వారాలు గడువు ఇవ్వండి

గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరగాలి

ప్రభుత్వ ఉత్తర్వు (జీవో నంబర్ 172) ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున కేవలం కొంతమంది అధికారుల నియామకం సరిపోదని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి స్థాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, ముద్రిత నోటీసుల్లోనే నిర్దిష్ట తేదీలు, సమయాలను పేర్కొంటూ వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. సర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు పరిపాలనా, ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## మోడీ కేబినెట్లో రిజర్వేషన్ల చిచ్చు!

జరిపిన కేంద్రమంత్రి నడ్డా వారికి కీలక హామీలు కూడా ఇచ్చారు. అయినా రిజర్వేషన్ల వివాదం కొనసాగుతోంది.అయితే ఈ రిజర్వేషన్ల వివాదం ఇప్పుడు కేంద్ర కేబినెట్లో సైతం చిచ్చు రేపుతోంది. తాజా ఆందోళనల నేపథ్యంలో రిజర్వేషన్ విధానాన్ని సమీక్షించాలని ఎన్డీయే భాగస్వామిగా ఉన్న హెచ్ఏఎం (సెక్యులర్) తాజాగా కోరింది. దీనిపై మండిపడుతున్న మరో కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తన సహచరుడు, హెచ్ఏఎం నేత జీతన్ రామ్ మాంఝీ రాజీనామాను కోరారు. దీంతో ఎన్డీఏలో చీలిక ఏర్పడిందనే ప్రచారం సాగుతోంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసనల నేపథ్యంలో, రాజకీయాల్లోనూ తిరిగి రిజర్వేషన్ల చర్చ మొదలైందన్న ప్రచారానికి ఇది ఊతమిచ్చేలా ఉంది.మాంఝీకి చెందిన హెచ్ఏఎం పార్టీ ప్రస్తుత రిజర్వేషన్ల వ్యవస్థలోనే ఎస్సీ, ఎస్టీలకు ఉప-కోటాలను సమర్థించడంతో బీహార్‌కు చెందిన చిరాగ్ పాస్వాన్, మాంజీ మధ్య వాగ్వాదం చెలరేగింది. అత్యంత బలహీన, చారిత్రాత్మకంగా అణగారిన వర్గాలకు రిజర్వేషన్ల ప్రయోజనాలు అందేలా చూడటానికి సమీక్ష అవసరమని మాంఝీ కుమారుడు, బీహార్ మంత్రి సంతోష్ కుమార్ సుమన్ అన్నారు.తాము రిజర్వేషన్లను రద్దు చేయడం గురించి మాట్లాడటం లేదని, రిజర్వేషన్లను మరింత న్యాయబద్ధంగా, సమర్థవంతంగా మార్చడం గురించి, అణగారిన వర్గాలకు అవి వాస్తవంగా చేరేలా చూడటం గురించి మాట్లాడుతున్నామంటూ సుమన్ క్లారిటీ ఇచ్చారు. అయినా చిరాగ్ పాశ్వాన్ ఆగ్రహం చల్లారలేదు. దీంతో శనివారం ఆయన మాంఝీని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం

కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందాలనే సంజీవని ప్రాజెక్టు తీసుకొచ్చామని తెలిపారు. "రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ దిశగా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. కనెక్టివిటీ పెంచేందుకు కూడా మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహించి ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. కొండ ప్రాంతాల్లోని వారికి వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండకూడదని నా సంకల్పం. దీని కోసమే సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో, చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను పెద్ద ఆస్పత్రికి డ్రోన్ల ద్వారా తరలించి పరీక్ష చేసి చికిత్స అందించేలా చర్యలు చేపట్టాం. తల్లిబిడ్డా ఎక్స్ ప్రెస్ ద్వారా గర్భిణులకు సేవలందించేలా చర్యలు తీసుకున్నాం. 104 వాహనాల ద్వారా సంచార వాహనాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తాయి. గిరిజనులతో పాటు రాష్ట్రంలో ప్రతీ పౌరుడి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుంది." అని తెలిపారు.ఇకపై ప్రజల ఆరోగ్యం వారి సెల్‌ఫోన్‌లోనే ఉందని చంద్రబాబు చెప్పారు. ఎక్కడికి వెళ్లినా ఆరోగ్యం గురించి తెలుసుకోవచ్చని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలను మూడు నెలల్లో డెవలప్ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎలాంటి వైద్య పరీక్షలు అయినా సరే అక్కడే చేసుకునేలా మెరుగు పరుస్తామని వెల్లడించారు. ఈ క్రమంలోనే కీలక విషయాన్ని వెల్లడించారు. "గిరిజనులకు ఇప్పటికే చేసింది చాలా తక్కువేనని ఇంకా చేయాల్సింది చాలా ఉంది. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ వారికే దక్కాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యం. దీనిపై త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను తీసుకొస్తాం. అన్ని పల్లెలకు రోడ్లు వేస్తాం." అని భరోసా ఇచ్చారు.

## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు

సాంకేతికత ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తలపెట్టిన డ్రోన్ ప్రాజెక్టును సమీక్షించినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్పందిస్తూ, రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉండే గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో డ్రోన్లు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని అన్నారు. డ్రోన్ల ద్వారా రక్త నమూనాలను సేకరించడం, అత్యవసర ఔషధాలను వేగంగా చేరవేయడం వంటివి ఈ ప్రాజెక్టులో కీలకమని వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) జిల్లా ఆసుపత్రులతో, ఇతర వైద్య విభాగాలతో అనుసంధానించడం సులభతరం అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఉన్న ఈ విధానాన్ని మరింత వ్యవస్థీకృతం చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతంలో నివసించే ప్రతి పౌరుడికీ నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. టెక్నాలజీ సహాయంతో ఆరోగ్య సేవలను మరింత వేగవంతం చేసి, ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ ద్వారా ఈ వివరాలను పంచుకున్నారు.

## రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరగాలి

పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని మంత్రి స్పష్టం చేశారు. చట్టంలోని నిబంధనలను పాటిస్తూనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని, రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అధికారులు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.

### 45 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచడంపై వివరణ

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ లాగిన్‌లో భూములకు సంబంధించిన 45 దరఖాస్తులు ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రస్తావించారు. ఈ విషయంపై సంబంధిత తహసీల్దార్‌ను వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచడం సరికాదని, ప్రతి దరఖాస్తుపై అధికారులు బాధ్యత తీసుకుని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

### ప్రజలను ఇబ్బంది పెట్టే విధానాలకు చోటు లేదు

తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు తమ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను సేవా దృక్పథంతో పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అవసరం లేని పత్రాలు, ప్రక్రియల పేరుతో ప్రజలను తిప్పుకోవడం, చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా రోజుల తరబడి వేచి ఉండేలా చేయడం వంటి విధానాలను నివారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి, ప్రజల సమస్యలను పరిష్కరించాలి, రెవెన్యూ కార్యాలయాలకు వచ్చిన వ్యక్తి సంతృప్తితో తిరిగి వెళ్లేలా చూడాలి అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

### రీ-సర్వేలోనూ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత చేపట్టిన రీ-సర్వేకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. డిసెంబర్‌లో రెండో విడత రీ-సర్వే చేపట్టేందుకు ఇప్పటి నుంచే అధికారులు సిద్ధం కావాలని సూచించారు. తొలి విడతలో రీ-సర్వే చేపడుతున్న 70 గ్రామాల్లో సర్వేను పారదర్శకంగా నిర్వహించి గ్రామ సరిహద్దులను పక్కాగా నిర్ధారించాలని ఆదేశించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో రీ-సర్వేను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, ఆర్డీవోలు, తహసీల్దార్లు కూడా గ్రామసభలకు హాజరై పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. సర్వే నిర్వహించిన రోజే భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, సర్వేయర్ల కొరత ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే పక్క మండలాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని అన్నారు. విధులకు హాజరుకాని లైసెన్స్ సర్వేయర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

### ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు 15 రోజుల్లో పరిష్కరించాలి

ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో ఉన్న ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా 15 రోజుల్లో ఎల్-3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు.మొదటి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను దసరాలోపు పూర్తి చేయాలని, గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వివిధ దశల్లో నిలిచిపోయిన నిర్మాణాలను గుర్తించి 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్ని పన్నులు, రవాణా చార్జీలు కలుపుకొని రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా సిమెంట్ కంపెనీలతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇళ్లకు సమీపంలో ఎక్కడ ఇసుక లభిస్తే అక్కడి నుంచి అందించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

### ఇంటి పట్టాల పంపిణీ వేగవంతం చేయాలి

గతంలో ఇంటి పట్టాల కోసం భూములను గుర్తించినప్పటికీ ఇంకా పంపిణీ చేయని వాటిని వెంటనే గుర్తించి జాబితా రూపొందించాలని, అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను కూడా చట్టానికి లోబడి శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలకు పరిష్కారం చూపడమే రెవెన్యూ అధికారుల ప్రధాన బాధ్యతగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## అప్పీల్ లేకుండా శిక్ష పెంచడం చట్టవిరుద్ధం

జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన గోపి అనే వ్యక్తి శిక్షను పెంచుతూ మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది.

### అసలేం జరిగిందంటే.?

కాలికట్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ మాలిక్ మహమ్మద్ వద్ద అంబరసు అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే ఓ మోసపూరితమైన అక్రమ వ్యవహారంలో పట్టుబడటంతో అంబరసును వీసీ ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ క్రమంలో ప్రతీకారం తీర్చుకోవాలని కసి పెంచుకున్న అంబరసు, తన సహచరుడైన గోపితో కలిసి ప్లాన్ వేశాడు. వీసీ నివాసంలోకి చొరబడేందుకు ప్రయత్నించి, ముందుగా అక్కడ కాపలా ఉన్న వాచ్ మెన్ జ్ఞానప్రకాశంను దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత వీసీ మాలిక్ మహమ్మద్‌ను చంపేసి, ఆయన భార్య ఖతీజా బీబీని కారులో బంధించి అపహరించారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లా ఒంగూర్ గ్రామానికి ఆమెను తీసుకెళ్లి పెట్రోల్, డీజిల్ మిశ్రమాన్ని పోసి సజీవదహనం చేశారు. 2007 నవంబర్ 14వ తేదీన పోలీసులు ఆమె పాక్షికంగా కాలిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### ముందస్తుగా విడుదల చేసే అవకాశం లేకుండా

అయితే ఈ ఘోర హత్యలపై విచారణ జరిపిన విచారణ కోర్టు (ట్రయల్ కోర్టు) ప్రధాన నిందితుడు అంబరసుకు ఉరిశిక్ష విధించగా, అతనికి సహకరించిన గోపికి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా తీర్పునిచ్చింది. అయితే ఈ కేసు మద్రాస్ హైకోర్టుకు వెళ్లినప్పుడు హైకోర్టు తన స్వీయ అధికారాలను ఉపయోగిస్తూ గోపికి విధించిన యావజ్జీవ శిక్షను "జీవితాంతం జైలులోనే ఉండేలా తీర్పునిచ్చింది. సాధారణంగా యావజ్జీవ శిక్ష పడిన వారికి 14 ఏళ్ల జైలు జీవితం పూర్తి చేసుకున్నాక చట్టపరంగా రెమిషన్ ద్వారా ముందస్తుగా విడుదలయ్యే అవకాశం ఉంటుంది. కానీ ఈ కేసులో మాత్రం గోపిని ముందుస్తుగా విడుదల చేసేందుకు ఏమాత్రం అవకాశం లేదని తేల్చి చెప్పింది. శిక్ష పెంపును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు మద్రాస్ హైకోర్టు చర్యను తప్పుబట్టింది. ప్రభుత్వం కానీ, బాధిత కుటుంబం కానీ శిక్షను పెంచాలని ప్రత్యేకంగా అప్పీల్ చేయని పక్షంలో అప్పీలేట్ కోర్టు సుమోటోగా తన రివిజన్ అధికారాన్ని ఉపయోగించి నిందితుడి శిక్షను పెంచకూడదని స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వ్యక్తికి అంతకుముందు ఉన్న పరిస్థితి కంటే అధ్వాన్నమైన పరిస్థితిని కల్పించేలా అప్పీలేట్ కోర్టులు నిర్ణయాలు తీసుకోకూడదని తేల్చి చెప్పింది. అంతేకాకుండా శిక్షలను ఒకదాని తర్వాత ఒకటి అనుభవించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా సవరించిన అత్యున్నత కోర్టు ఆ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు కావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## పకడ్బందీగా 'సర్' నోటీసులు

వివరణల నమోదు ప్రక్రియను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. అలాగే, మ్యాపింగ్ కానీ లేదా ఇతర సాంకేతిక లోపాలు ఉన్న కేసుల జాబితాను రాజకీయ పార్టీలకు అందజేయాలని సీఈవో సూచించారు. నోటీసులకు స్పందనగా సమర్పించాల్సిన పత్రాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్థితిగతులపై ప్రతి వారం రాజకీయ పార్టీలకు నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో జి.ఎస్. చారి తదితరులు పాల్గొన్నారు.

## వడివడిగా అడుగులు

తీసుకుంటున్న చర్యలపై అజిత్‌రెడ్డి సమీక్షించారు. చారిత్రక నిర్మాణాలకు ఇబ్బంది కలగకుండా, మెట్రో పనులకు అవసరమైన మార్గాన్ని సిద్ధం చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలను పరిశీలించాలని సూచించారు. మెట్రో కారిడార్‌లో విద్యుత్ తీగలు, స్తంభాలు, వాటర్ వర్క్స్ పైప్‌లైన్లు తదితర యుటిలిటీలు పనులకు అడ్డంకిగా మారకుండా వాటిని సురక్షితంగా తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు ఎండీ ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో ప్రభావిత ఆస్తుల తొలగింపును కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు.పాతనగరం మెట్రో పనులను వేగంగా పూర్తిచేసి స్థానిక ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యం అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలను అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలని అజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో పనులకు స్థానిక ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోందని, వారు తమవంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. కారిడార్‌కు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి త్వరితగతిన రైట్ ఆఫ్ వే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భూసేకరణలో ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు కృషి చేసిన రెవెన్యూ అధికారులను ఆయన అభినందించారు. త్వరలోనే మిగిలిన భూసేకరణ పూర్తి చేసి ప్రాజెక్టును పట్టాలెక్కించాలని అన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం

నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం వారికి సూచించారు. ప్రత్యేకంగా వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

### రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు పెంచాలి: సీఎం రేవంత్

ఇక రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నివేదిక అందించింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి గారి నేతృత్వంలోని సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, భవానీ రెడ్డి ముఖ్యమంత్రి గారిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి నివేదిక అందించారు. కమిషన్ సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు పెంపు, ఎఫ్‌పీవోల ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి నివేదికలో కమిషన్ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను కలిపే కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించింది. చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని, చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్సరిహద్దులను తక్షణం గుర్తించి ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని సూచించింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని తెలిపింది. గడిచిన రెండేళ్ల కాలంలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ ప్రతినిధి బృందం వివరించింది. ఈ సందర్భంగా కమిషన్ పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు.

## విజయసాయిరెడ్డి సంచలన బహిరంగ లేఖ

"వైసీపీ కోటరీ నన్ను నమ్మకద్రోహి అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయిస్తోంది" అంటూ మాజీ వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బహిరంగ లేఖ విడుదల చేశారు.జగన్‌కు తాను ఎప్పుడూ నమ్మకద్రోహం చేయలేదని, నమ్మకద్రోహమే తన రక్తంలో ఉంటే ఎప్పుడో పార్టీ మారిపోయేవాడినని ఆయన పేర్కొన్నారు

. జగన్‌గారికి నమ్మకస్తుడిననే కారణంతోనే అనేక కేసుల్లో తనను నిందితుడిగా చేర్చారని తెలిపారు.2020 తర్వాత తనపై పార్టీలో క్రమంగా కుట్రలు, అవమానాలు పెరిగాయని విజయసాయిరెడ్డి ఆరోపించారు. తనను ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించడంతో పాటు కోర్ కమిటీ నుంచి కూడా తొలగించారని పేర్కొన్నారు."నేను ఎప్పుడూ కోటరీలో లేను. జగన్‌గారి దృష్టిలో నా మాటకు ఉన్న విలువను 2020 నుంచి అంచెలంచెలుగా తగ్గించింది ఎవరు?" అని ప్రశ్నించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో సజ్జల రామకృష్ణారెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించారని విజయసాయిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రులకు సైతం జగన్‌ను కలవకుండా అడ్డుకున్నది సజ్జలేనని ఆరోపించారు.పార్టీలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు సజ్జల ఆధ్వర్యంలో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై కార్యకర్తలు, జగన్ అభిమానులు ఆలోచించాలని ఆయన కోరారు.తాను పార్టీకి, రాజ్యసభ పదవికి రాజీనామా చేసి ఇప్పుడు వేరే పార్టీ పెడుతున్నానని విజయసాయిరెడ్డి తన లేఖలో వెల్లడించారు.కాగా, ఈ బహిరంగ లేఖలో విజయసాయిరెడ్డి వైసీపీ అంతర్గత వ్యవహారాలు, తనపై జరిగిన అవమానాలు, సజ్జల పాత్రపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## గిరిజన యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం

పోలవరం జిల్లాలోని పౌరసరఫరాల శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఖాళీగా ఉన్న ఐదు పోస్టుల భర్తీకి అర్హత కలిగిన గిరిజన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు మూడు ఉండగా డిగ్రీతో పాటు ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞాన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు రెండు ఉండగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. అభ్యర్థులు స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని పరిపాలన అధికారికి దరఖాస్తులను నేరుగా సమర్పించాలి. విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, ఫొటోలు తదితర అవసరమైన పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలి. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హత ఆధారంగా ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక ప్రక్రియ చేపడతారు. అర్హత కలిగిన గిరిజన యువతీ యువకులు ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించాలి

## మారేడుమిల్లిలో 1/70 చట్టం బేఖాతరు..

### - అనుమతులు లేకుండా రిసార్ట్స్ నిర్మాణాల దందా

**మారేడుమిల్లి మండలం.** గిరిజనుల భూములకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని మారేడుమిల్లిలో తుంగలో తొక్కుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు ఎలాంటి శాశ్వత కట్టడాలు కట్టకూడదన్న నిబంధన ఉన్నా, పర్యాటకం ముసుగులో రిసార్ట్స్ పేరుతో భారీ కాంక్రీట్ భవనాలు వెలిసిపోతున్నాయి.

**1/70 చట్టం ఏం చెబుతోంది** ఏపీ షెడ్యూల్డ్ ఏరియా ల్యాండ్ ట్రాన్స్ ఫర్ రెగ్యులేషన్ 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీలో గిరిజన భూమిని గిరిజనేతరులకు అమ్మడం, బదలాయించడం, లీజుకు ఇవ్వడం పూర్తిగా నిషేధం. ఒకవేళ లీజు తీసుకున్నా వ్యవసాయానికి మాత్రమే తీసుకోవాలి, శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ ఇక్కడ ఆ చట్టానికి పూర్తి విరుద్ధంగా రెండు మూడు అంతస్తుల భవనాలు, స్విమ్మింగ్ పూల్స్, కాటేజీలు కట్టేస్తున్నారు.అనుమతులు శూన్యంఏజెన్సీలో ఏదైనా కట్టడం కట్టాలంటే ముందుగా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీ, అటవీ శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. అసలు ఈ రిసార్ట్స్ కు పంచాయతీ లేఅవుట్ అప్రూవల్ గానీ, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ గానీ లేనే లేదని సమాచారం. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కట్టిన ఈ నిర్మాణాలన్నీ 1/70 చట్టం ప్రకారం చట్టవిరుద్ధమే.

**బినామీల తెర వెనుక దందా** అధికారుల కళ్లుగప్పేందుకు గిరిజనుల పేరు మీద భూమి ఉన్నట్లు చూపి, వెనుక నుంచి గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టి రిసార్ట్స్ కడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాగితాలపై లీజు వ్యవసాయానికే అని రాసుకుని, క్షేత్రంలో మాత్రం లక్షలు వసూలు చేసే రిసార్ట్స్ నడుపుతున్నారు. దీనివల్ల అసలు భూమి హక్కుదారులైన గిరిజనులకు నెలకు 5 వేలో, 10 వేలో ఇచ్చి మోసం చేస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలని డిమాండ్** అనుమతులు లేకుండా, 1/70 చట్టాన్ని ఉల్లంఘించి కట్టిన అక్రమ రిసార్ట్స్ ను వెంటనే సీజ్ చేసి కూల్చివేయాలని, భూములను తిరిగి గిరిజనులకు అప్పగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నాయి.

# నూతన విద్యా విధానం అమలుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి



**చాగలమర్రి** నూతన విద్యా విధానాలను అనుసరిస్తూ విద్యార్థులకు బోధన అందించాలని చాగలమర్రి మండల విద్యా శాఖ అధికారి శేషశయనారెడ్డి సూచించారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో శనివారం జరిగిన స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో విద్యాభివృద్ధికి చేపట్టవలసిన అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అలాగే మండలంలోని చింతలచెరువు జడ్పీ హైస్కూల్లో జరిగిన స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఓఇూ2 సయ్యద్ న్యామతుల్లా, కాంప్లెక్స్ చైర్మన్ సుబ్బారాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మూగజీవులు పట్ల ఆపద్బాంధవుడు



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ కు చెందిన అమ్మ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా బిజ్జల నగేష్ సేవా కార్యక్రమాలు అందర్నీ అలరిస్తున్నాయి. ప్రతినిత్యం సమాజ సేవ అనే పరమాధిగా భావిస్తూ సమాజానికి ఆయన చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరు ప్రశంసిస్తున్నారు. శ్రావణ మాసం శనివారం సందర్భంగా గోమాతలకు , కుక్కలు , కోతులు తదితర మూగజీవాలకు ఆహారాన్ని పండ్లను, బిస్కెట్లను అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. డాక్టర్ బిజ్జల నగేష్ చేస్తున్న సేవలను ఇటీవల మండల అధికారులు కూడా గుర్తించి నగేష్ ను ఘనంగా సన్మానించడం జరిగింది. సమాజసేవకుడు బిజ్జల నగేష్ కు ప్రభుత్వం పెన్షన్, గృహం తదితర ప్రయోజనాలు అందించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ నాయుడుల పెళ్లిరోజు వేడుకలు

**- సర్వ లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు**

**- భక్తులకు అన్నదాన కార్యక్రమం**





**శిరివెళ్ల** నంద్యాల గిద్దలూరు రహదారి లో మహాదేవపురం పొలిమేర లో నల్లమల అరణ్యంలో వెలసిన శ్రీ సర్వ లక్ష్మి నరసింహ స్వామికి ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ భార్గవరానీ నాయుడు ల పెళ్లిరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ చైర్మన్ నాగేంద్ర, టిడిపి యూత్ లీడర్ చిన్న,ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రంగనాయకులు, పవన్ కుమార్ శర్మ లు సర్వ లక్ష్మీనరసింహస్వామికి, చెంచులక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు పూలమాలలతో ఆకు పూజలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నాగేంద్ర,చిన్నా,లు మాట్లాడుతూ మా ప్రియతమ నాయకురాలు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ నాయుడు ల పెళ్లిరోజును పురస్కరించుకొని నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లి ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించే శక్తిని ఆ సర్వ లక్ష్మి నరసింహస్వామి ఇవ్వాలని కోరుతూ పూజలు నిర్వహించామన్నారు.

# తెలుగు వెలగాలి - తెలుగు భాష వర్ధిల్లాలి.

**చాగలమర్రి** చాగలమర్రి మండలంలో అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాల నందు ఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల ఆధ్వర్యంలో తెలుగు భాష కోసం కృషి చేసిన వ్యక్తి గిడుగు వెంకట రామమూర్తి మరియు క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ గారి చిత్ర పటాలకు పూల మాలలతో నివాళులర్పించడం జరిగింది. 1966 అధికార భాషా చట్టం ద్వారా తెలుగును రాష్ట్ర అధికార భాషగా ప్రకటించడం జరిగిందని ప్రతి ఏడాది ఆగస్ట్ 29 న ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో ఈ తేదీని తెలుగు కవి వెంకట రామమూర్తి జన్మ దినోత్సవంగా మార్చడం జరిగింది. తెలుగు భాష అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయులను నేడు తలుచుకోవడం ద్వారా అమ్మ భాషకు సేవ చేసిన తెలుగు పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. “గిడుగు” అనే అక్షర ఆకృతిలో విద్యార్థులు తమ ఆసక్తిని ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ అన్సర్ బాష గారు మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే, మాతృభాష తెలుగు మన జీవితాలకు వెలుగునిస్తుంది అన్నారు. తెలుగు భాష పరిరక్షణకు, సుసంపన్నం చేసుకోవడానికి తెలుగు ప్రజలందరూ సిద్ధం ఉండాలని భావి తరాలకు తెలుగు మార్గదర్శకం కావాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు నినాదాలను మరియు కవుల చిత్రపటాలను ప్రదర్శించడం జరిగింది.

# గరలపాలెంలో అక్రమ ఎర్రమట్టి తరలింపు

**- అనుమతి కంకరకు.. తవ్వేది ఎర్రమట్టి**



**కోరుకొండ** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గరలపాలెం క్వారీ నుండి అక్రమంగా ఎర్రమట్టి తరలిపోతోంది.మైనింగ్ శాఖ అధికారులు ఈ కొండ నుండి రాయిని పగలగొట్టి కంకర తయారీకి మాత్రమే అనుమతి ఇచ్చారు. కానీ అనుమతులకు వ్యతిరేకంగా రోజూ 10 లారీలతో ఎర్రమట్టిని తవ్వి బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు.ఎర్రమట్టి తరలింపుకు ప్రత్యేక అనుమతి తీసుకోవాలి, రాయల్టీ చెల్లించాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా తరలింపు జరుగుతుండటంతో ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లుతోంది.ఈ మట్టిని కొత్తగా వేస్తున్న బీటీ రోడ్డుకి విరువైపులు వేయడానికి క్వారీ నుండి మట్టి తరలించడానికి రాయబారాలు జరిగాయని తెలుస్తుంది .దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అరణ్యారామంలో రావి-వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు

**- హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యమని పిలుపు**

**గుంటూరు** ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన ‘అశ్వత్థ నారాయణ వివాహం’ కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి-వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.అనంతరం, రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ‘అరణ్యారామం’ భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేరళ సీఎంను అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు

**తిరువనంతపురం** కేరళలోని అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. ముఖ్యమంత్రి వీడీ సతీశన్ కాన్వాయ్‌ను అడ్డుకోవడమే కాకుండా, ఆయనతో తీవ్ర వాగ్వాదానికి దిగారనే ఆరోపణలపై స్థానిక కాంగ్రెస్ నాయకుడిని ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.శ్రీనారాయణ గురు జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి సతీశన్ శుక్రవారం సాయంత్రం తిరువనంతపురం వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. శ్రీకార్యం పోలీస్ స్టేషన్ పరిధిలో తిరువనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) సభ్యుడు అనిల్ కుమార్ మరికొందరితో కలిసి ముఖ్యమంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో నిర్వహించే కార్యక్రమానికి ఎందుకు హాజరుకావడం లేదని వారు ముఖ్యమంత్రిని నిలదీశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి తన వాహనం దిగి అనిల్ కుమార్‌తో మాట్లాడగా, ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం ముఖ్యమంత్రి అక్కడి నుంచి తన పర్యటనకు వెళ్లిపోయారు.కాగా, చెంతిలో నిర్వహించే కార్యక్రమం ముఖ్యమంత్రి అధికారిక షెడ్యూల్‌లో లేదని, తాము రాలేమని నిర్వాహకులకు ముందే సమాచారం అందించామని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టం చేసిందిఈ ఘటనపై స్పందించిన పోలీసులు, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, అక్రమంగా అడ్డుకోవడం, బెదిరింపులకు దిగడం వంటి సెక్షన్ల కింద చెంతి అనిల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి శనివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. అయితే, తాను ముఖ్యమంత్రిని అడ్డుకోలేదని, కేవలం స్వాగతం పలుకుతూనే తమ నిరసనను తెలియజేయాలని భావించానని అనిల్ కుమార్ పేర్కొన్నారు. పార్టీలోని అంతర్గత గ్రూపు రాజకీయాల కారణంగానే ఈ వివాదం తలెత్తిందని ఆయన ఆరోపించారు. కాగా, ఈ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన డీసీసీ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు ఎన్. శక్తన్, అనిల్ కుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉందని సూచనప్రాయంగా వెల్లడించారు.

# కాంగ్రెస్‌లో చేరికలు



**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో చిట్యాల మండలంలోని బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన రామచంద్రాపూర్ సర్పంచ్ గాజా హేమలత అశోక్, కైలాపూర్ గ్రామ సర్పంచ్ కోదారి ఓదెలు తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల ముఖ్య నాయకులు, సర్పంచులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి,రైతు సంక్షేమం, మహిళల సాధికారత, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని అన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు తమ గ్రామాల అభివృద్ధికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి భూపాలపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరఫున స్వాగతం పలుకుతూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

**- డీసీసీ అధ్యక్షుడిపై బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ తిరుగుబాటు!**

**అదిలాబాద్,** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నరేష్ జాదవ్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పార్టీలో తనకు తగిన గుర్తింపు, విలువ ఇవ్వడం లేదని, నరేష్ జాదవ్ ప్రతి విషయంలోనూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ పార్టీ నేతలను విస్మరిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన అధిష్ఠానం వద్ద తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు.?శనివారం ఉదయం ఆడే గజేందర్ తన అనుచరులు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో కలిసి భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అక్కడ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను నేరుగా కలిసి జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ఫిర్యాదు చేయనున్నారు. ముఖ్యంగా ఇటీవల ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ పీఏసీ కమిటీలో తనకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై గజేందర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీనికితోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ల ఎంపిక ప్రక్రియలో బోథ్ నియోజకవర్గానికి చెందిన ఆశావహుల పేర్లను పక్కనబెట్టి, డీసీసీ అధ్యక్షుడు తన ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆయన వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.జిల్లా అధ్యక్షుడి వ్యవహారశైలి వల్ల పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పెరిగిపోతున్నాయని, క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులకు అన్యాయం జరుగుతోందని ఆడే గజేందర్ అనుచరులు ఆరోపిస్తున్నారు. పార్టీ ప్రతిష్టను కాపాడటంతోపాటు సంస్థాగతంగా బలోపేతం చేయాలంటే తక్షణమే జిల్లా అధ్యక్షుడిని మార్చాలని, పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే నేతకు జిల్లా పగ్గాలు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బోథ్ నియోజకవర్గ నేతల ఈ పర్యటన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# కర్ణాటక మంత్రి రాజీనామా

**బెంగళూరు,** కర్ణాటక ప్రభుత్వ మంత్రి బి.నాగేంద్ర శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్ర సంక్షేమ సంస్థ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ప్రతిపక్షాలు ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ప్రతిపక్షాల ఒత్తిడితో తాను రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నానని నాగేంద్ర స్పష్టం చేశారు. ఆగస్టు 3న జరిగిన మంత్రివర్గ విస్తరణలో నాగేంద్ర పదవి దక్కించుకున్నారు. కానీ ఆయన కేవలం 25 రోజుల తర్వాత రాజీనామా చేశారు.బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో నాగేంద్ర భావోద్వేగానికి గురయ్యారు. ప్రతిపక్షాలు చేసిన ఆరోపణల కారణంగా తాను రాజీనామా చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ఇబ్బంది లేదా అసౌకర్యం కలిగించకూడదనే ఉద్దేశ్యంతోనే తాను పదవి నుంచి తప్పుకుంటున్నానని తెలిపారు. బళ్లారి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన నాగేంద్ర, గతంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. కర్ణాటక ప్రభుత్వ సంక్షేమ సంస్థ నిధుల దుర్వినియోగం ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఆయన 2024లో మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత, ఆగస్టు 3న జరిగిన మంత్రివర్గ విస్తరణ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆయనను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు.ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు నాగేంద్ర కాంగ్రెస్ నాయకత్వం నుంచి అనుమతి కోరారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారిని ఎదుర్కొని, తన పేరును నిర్దోషిగా నిరూపించుకోవాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మీడియాతో మాట్లాడిన అనంతరం, నాగేంద్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూడా కలిశారు. నాగేంద్ర తనకు రాజీనామా సమర్పించారని శివకుమార్ తెలిపారు. అయితే, తుది నిర్ణయం తీసుకునే ముందు పార్టీ అగ్ర నాయకత్వంతో సంప్రదిస్తానని ఆయన పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో నాగేంద్ర నిర్దోషి అని కూడా శివకుమార్ స్పష్టం చేశారునాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నాగేంద్రకు శివకుమార్ ప్రణాళిక, గణాంకాల శాఖ బాధ్యతను అప్పగించారు. తన రాజీనామా సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ, తన రాజీనామా నిర్ణయం భారతీయ జనతా పార్టీ, జేడీఎస్ ఒత్తిడికి తలొగ్గి చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్‌ను ఇబ్బందికరమైన స్థితిలో పెట్టడం ఇష్టం లేకనే తాను ఈ నిర్ణయాన్ని స్వచ్ఛందంగా తీసుకున్నానని చెప్పారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల కోసం రిజర్వ్ చేసిన 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాను పర్యటించి, బీజేపీ, జేడీఎస్‌లు ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి ఎలా నిజమని నిరూపించడానికి ప్రయత్నించాయో ప్రజలకు వివరిస్తానని నాగేంద్ర తెలిపారు.నాగేంద్రపై ఉన్న నిధుల దుర్వినియోగం ఆరోపణల కేసుకు సంబంధించి, అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా బీజేపీ, జేడీఎస్ పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. నాగేంద్ర రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ కార్యకలాపాలకు అంతరాయం కలిగించాయి. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు చెందిన సుమారు ?89 కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. నాగేంద్ర రాజీనామాను డిమాండ్ చేస్తూ, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రాయచూర్ నుంచి బళ్లారి వరకు 10 రోజుల పాదయాత్రను బీజేపీ ప్రకటించింది. 2024 ఎన్నికల కేసుకు సంబంధించిన ఇతర సమస్యలు ఉన్నందున, నాగేంద్ర రాజీనామా తర్వాత కూడా పాదయాత్ర కొనసాగుతుందని ఆ పార్టీ పేర్కొంది. రాజీనామా చేసిన అనంతరం, నాగేంద్ర బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది పురాణాల యుగం కాదని, బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ యుగం అని ఆయన అన్నారు. దళితులు, మహిళలు, మైనారిటీలు, గిరిజనుల పురోగతిని అడ్డుకోవడానికే బీజేపీ ‘మనుస్మృతి లాంటి ఆలోచనా విధానం’తో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఇలా జరగనివ్వనని నాగేంద్ర స్పష్టం చేశారు.ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దర్యాప్తు బృందం, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ తనకు క్లీన్‌చిట్ ఇచ్చాయని నాగేంద్ర పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) మొదట్లో తన దర్యాప్తులో తన పేరును చేర్చలేదని ఆయన అన్నారు. అయితే, తన రెండో క్యాబినెట్ నియామకం తర్వాత, తన పేరును దర్యాప్తులో చేర్చిందని ఆయన తెలిపారు. ఈ పరిణామాలతో మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా విషయంపై కాంగ్రెస్ నాయకత్వం చర్చించింది. పార్టీ అగ్ర నాయకత్వంతో చర్చించిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటానని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు.

# కరీంనగర్ కీర్తిని అంతర్జాతీయ వేదికపై చాటనున్న అక్షిత

**జాతీయ స్థాయిలో స్వర్ణం. ఏషియన్ పోటీలకు భారత జట్టులో స్థానం**



**కరీంనగర్** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, చింతకుంట జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆకుల అక్షిత భారతదేశం తరపున ఏషియన్ త్రోబాల్ పోటీలకు ఎంపికై అరుదైన ఘనత సాధించింది.గత నెలలో తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో నిర్వహించిన జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొన్న ఆకుల అక్షిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్టుకు బంగారు పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించింది. జాతీయ స్థాయిలో ఆమె చూపిన అత్యుత్తమ ప్రదర్శనను గుర్తించిన ఎంపిక కమిటీ అక్షితను భారత జట్టుకు ఎంపిక చేసింది.శ్రీలంకలోని నిగాంబో ఇండోర్ స్టేడియంలో నవంబర్ 19 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఏషియన్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆకుల అక్షిత భారతదేశం తరపున పాల్గొననుంది. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో చింతకుంట గురుకుల పాఠశాల, కళాశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.ఆకుల అక్షిత సాధించిన ఈ ఘనత పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎ. లక్ష్మి మేడం, జోనల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, పీడీ సుష్మ మేడం, పీఈటీ సుజాత మేడం, కోచ్ సతీష్తో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందడం ఎంతో గర్వకారణమని తెలిపారు. శ్రీలంకలో జరిగే ఏషియన్ పోటీల్లో కూడా ఆకుల అక్షిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారతదేశానికి పతకం తీసుకురావాలని ఆకాంక్షించారు.చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయికి చేరుకున్న ఆకుల అక్షిత చింతకుంట ప్రాంతానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# హలో మాల.. ఛలో సెక్రటేరియట్

**- రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మాలల రాజ్యాంగ హక్కులకు నష్టం కలిగిస్తున్న రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న "హలో మాల.. ఛలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు పిలుపునిచ్చారు.శనివారం రాయపోల్ మండల కేంద్రంలో "హలో మాల.. ఛలో సెక్రటేరియట్" ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ర్యాకం శ్రీరాములు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం మాలలకు కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులు, అవకాశాలు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. "హలో మాల.. ఛలో సెక్రటేరియట్" నినాదంతో ఈ నెల 31వ తేదీ సోమవారం నిర్వహించనున్న సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు నాయకులు మండల యాదగిరి, మద్దెల చంద్రం, కరికే పరశురాములు, రాంపల్లి సతీష్, నవీన్, అజయ్, భానుప్రసాద్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి

# ఎల్లవేళలా కృషి చేస్తాం

**- జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేసి, విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఎల్లవేళలా కృషి చేస్తామని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు.సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం లిలితీగుల్ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్, యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కప్పర భాను ప్రకాశ్ రావు చేసిన అభ్యర్థన మేరకు శనివారం దరిపల్లి చంద్రం గ్రామాన్ని సందర్శించారు. పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రంథాలయం ఏర్పాటుకు అనువైన స్థలం ఉన్నట్లు గుర్తించారు.గ్రంథాలయం ఏర్పాటుకు గ్రామపంచాయతీ తరఫున అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించిన చైర్మన్.. మిగిలిన పుస్తకాలు, అవసరమైన మెటీరియల్, నిర్వహణకు సంబంధించిన అలవెన్సులు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారుగ్రంథాలయ భవనానికి నిధులు కేటాయిస్తాంతీగుల్ గ్రామంలో గ్రంథాలయ గది నిర్మాణం చివరి దశలో ఉందని, పనులు పూర్తిచేయడానికి మరిన్ని నిధులు అవసరమని భాను ప్రకాశ్ రావు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన దరిపల్లి చంద్రం.. త్వరలో నిధులు అందుబాటులోకి రాగానే గ్రంథాలయానికి అవసరమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో దరిపల్లి చంద్రంను గ్రామస్థులు, నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.చైర్మన్‌కు భాను ప్రకాశ్ రావు ఆత్మీయ సత్కారంతీగుల్ గ్రామానికి తొలిసారి వచ్చిన సందర్భంగా మాజీ సర్పంచ్, యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కప్పర భాను ప్రకాశ్ రావు తన నివాసంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రంను శాలువాతో సత్కరించి, తేనీరు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగరీ నాగరాజు, పరిశరములు, గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ భూమయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు బట్టు దయానంద రెడ్డి, కర్నాకార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు జన్గని ఐలయ్య, యువజన కాంగ్రెస్ నాయకుడు మనోజ్ కుమార్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై భారీ గుంత

**- ప్రమాదాలకు దారితీస్తున్న కొలుగూరు రహదారి.. పట్టించుకోని అధికారులు**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ మండలం కొలుగూరు గ్రామ శివారులోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రహదారిపై భారీ గుంత ఏర్పడడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కొన్ని నెలలుగా రహదారి దెబ్బతిన్నప్పటికీ ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత సరిగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన రహదారిపై నిత్యం భారీగా వాహనాల రాకపోకలు ఉంటాయని, గుంతను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి భారీ గుంతను పూడ్చడంతో పాటు ప్యాచ్‌వర్క్ చేపట్టి రహదారిని పూర్తిస్థాయిలో బాగు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# శామీర్‌పేటలో గంజాయి చాక్లెట్ల దందా గుట్టురట్టు

**- 24.59 కిలోల మత్తు చాక్లెట్లు సీజ్..**

**- 5,298 చాక్లెట్లు స్వాధీనం**

**- పాన్‌షాప్ ముసుగులో దందా..**

**- బీహార్‌కు చెందిన వ్యక్తి అరెస్ట్.. పరారీలో భార్య**




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)**శామీర్‌పేటలో గంజాయి చాక్లెట్ల దందా కలకలం రేపింది. పాన్‌షాప్ ముసుగులో చిన్నారులు, యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యవహారాన్ని పోలీసులు ఛేదించారు. పక్కా సమాచారంతో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భారీగా గంజాయి చాక్లెట్లు పట్టుబడ్డాయి. మొత్తం 5,298 గంజాయి చాక్లెట్లు, 24.59 కిలోల బరువుతో స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

### పాన్‌షాప్ ముసుగులో దందా

మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట గ్రామంలోని చంద్రారెడ్డి కాలనీ ప్లాట్ నంబర్ 05లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా బీహార్ రాష్ట్రం సమస్తీపూర్ జిల్లా గంగోలి గ్రామానికి చెందిన బిద్యానంద్ కుమార్ను అదుపులోకి తీసుకున్నారు.నిందితుడు తూంకుంటలో భార్య పూజా కుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటూ పాన్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

### 12 కవర్లలో 5,298 చాక్లెట్లు

ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో 12 కవర్లలో ప్యాక్ చేసిన 5,298 గంజాయి చాక్లెట్లు బయటపడ్డాయి. వీటి మొత్తం బరువు 24.59 కిలోలుగా పోలీసులు తెలిపారు.చాక్లెట్లతో పాటు ఒక వివో మొబైల్ ఫోన్, విక్రయాల ద్వారా వచ్చినట్లు భావిస్తున్న రూ.1,760 నగదు, చాక్లెట్లను తరలించేందుకు, దాచేందుకు ఉపయోగించిన బ్రౌన్ సూట్‌కేస్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### పాన్‌షాప్ కేవలం 'కాంటాక్ట్ పాయింట్'!

పోలీసుల విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. పాన్‌షాప్ ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో నిందితుడు ఈ అక్రమ దందాకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

జూన్ 2026లో భార్యతో కలిసి బీహార్‌లోని దర్భంగా జిల్లా ధనౌలి గ్రామం బైత్రీ బజార్‌లో చాక్లెట్లు కొనుగోలు చేసి, సూట్‌కేస్‌లో హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.పోలీసులకు అనుమానం రాకుండా పాన్‌షాప్‌ను కేవలం కస్టమర్లను సంప్రదించే కాంటాక్ట్ పాయింట్‌గా ఉపయోగించేవాడని పోలీసులు పేర్కొన్నారు. పాన్‌షాప్ వద్ద చాక్లెట్లు కావాలని అడిగిన వారిని ఇంటికి తీసుకెళ్లి అక్కడ విక్రయించేవాడని తెలిపారు.

### రూ.200కు కొనుగోలు.. రూ.600కు విక్రయం

40 చాక్లెట్లు ఉన్న ఒక ప్యాకెట్‌ను సుమారు రూ.200కు కొనుగోలు చేసి, ఒక్కో చాక్లెట్‌ను రూ.30 నుంచి రూ.50 వరకు, పూర్తి ప్యాకెట్‌ను రూ.600కు విక్రయిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.విక్రయాల నగదును తనతో పాటు భార్యకు సంబంధించిన ఫోన్ నంబర్ల ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించేవాడని విచారణలో గుర్తించినట్లు తెలిపారు.

### భార్య కోసం గాలింపు

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడి భార్య పూజా కుమారి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

### యువతను మత్తు బారిన పడేయడమే లక్ష్యమా?

చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలను విక్రయిస్తూ యువత, ముఖ్యంగా చిన్నారులను ఆకర్షించే ప్రయత్నాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి అక్రమ దందాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పాన్‌షాపులు, ఇతర వ్యాపారాల ముసుగులో మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాదారుడిపై పీడీ చట్టం

**- రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నగర కమిషనర్ సీరియస్**

**- రేషన్ బియ్యం అక్రమ రవాణాలో వరుస కేసులు నమోదైనా మారని తీరు..**

**- భవానీనగర్ పోలీసుల కఠిన చర్య**

**- నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు తరలింపు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా సేకరించి, నిల్వ చేసి, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న వ్యక్తిపై హైదరాబాద్ నగర పోలీసులు పీడీ చట్టాన్ని ప్రయోగించారు. వరుసగా కేసులు నమోదవుతున్నా అక్రమ బియ్యం దందాను కొనసాగిస్తున్న మహమ్మద్ రఫీక్ (24)పై నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు భవానీనగర్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.

### పేదల బియ్యమే అక్రమార్కుడికి ఆదాయ వనరు

ప్రభుత్వం పేదలకు తక్కువ ధరకు అందించే ప్రజా పంపిణీ బియ్యాన్ని వివిధ మార్గాల్లో అక్రమంగా సేకరించి, పెద్ద మొత్తంలో నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ రఫీక్ లాభాలు ఆర్జిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వం పేదల కోసం ఉద్దేశించిన బియ్యం పక్కదారి పట్టడం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం దెబ్బతినడమే కాకుండా ప్రభుత్వానికి, పౌర సరఫరాల సంస్థకు ఆర్థిక నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఇలా నగరంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై నిఘా పెట్టామని అధికారులు తెలిపారు.

### కేసులు నమోదైనా.. అక్రమ దందాకు బ్రేక్ లేదు

రఫీక్‌పై ఇప్పటికే భవానీనగర్, మీర్‌చౌక్, మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. భవానీనగర్ పోలీస్ స్టేషన్‌లో నేర సంఖ్య 82/2026.(మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌లో నేర సంఖ్య 92/2026. మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నేర సంఖ్య 210/2025. రేషన్ బియ్యం అక్రమ రవాణా లోవరుసగా కేసులు నమోదైనప్పటికీ ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న నేపథ్యంలో అతడి కార్యకలాపాలను నియంత్రించేందుకు పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### కమిషనర్ ఆదేశాలు.. పోలీసుల కఠిన చర్య

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పీడీ చట్టం కింద నిర్బంధానికి సంబంధించి ఆగస్టు 13న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ ఉత్తర్వుల మేరకు భవానీనగర్ పోలీసులు ఆగస్టు 29న మహమ్మద్ రఫీక్‌ను అదుపులోకి తీసుకుని పీడీ చట్టం కింద నిర్బంధించారు. అనంతరం తదుపరి చర్యల కోసం చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. అయితే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఈ వ్యవహారంపై కమిషనర్ సైతం సీరియస్ గా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### పేదల బియ్యంతో వ్యాపారమా.?

ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా సేకరించి సొమ్ము చేసుకునే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవన్న సంకేతాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే అక్రమ బియ్యం దందాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### రంగారెడ్డి జిల్లా పరిధిలో చర్యలు ఎప్పుడు.?

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతుందని ముఖ్యంగా (మంగళపల్లి) బొంగులూరు గేట్, తుర్కయంజాల్, బాలాపూర్, హయత్ నగర్, పెద్ద అంబర్పేట్, తుర్కయంజాల్ కట్టకింద, చంపాపేట్, సైదాబాద్, పెద్ద గోల్కొండ అమంగల్ షామీర్పేట్ రామవరం తదితర ప్రాంతాలలో కొన్ని సంవత్సరాల నుండి పెద్ద షెడ్లను అద్దెకు తీసుకొని గోదాములు నడిపిస్తున్నారని గతంలో వీళ్ళపై సివిల్ సప్లై అధికారులు దారులు చేసి పట్టుకుని కేసులు నమోదు చేశారు. అయిన ఇప్పటికీ ఈ దండ సాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడంతో గత నెల రోజుల నుండి ఈ ప్రాంతాలలో జోరుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని వీళ్ళపై కఠిన చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులకు చెప్పిన ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారు వచ్చి చూడాలి.

# నరకడమే తెలుసు.. నాటడం తెలియదు

**- గత ప్రభుత్వంపై నాగబాబు ధ్వజం - కూటమిది 'నరికే సంస్కృతి' కాదు.. 'నాటే సంస్కృతి'**

**- భూమాతను కాపాడటం బాధ్యత కాదు.. కర్తవ్యం**

**- అశ్వత్థ నారాయణ వివాహంతో ప్రకృతి -ఆధ్యాత్మికతల సమ్మేళనం**

**- రావి--వేప మొక్కలు నాటిన ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు దంపతులు**





**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** "గత ప్రభుత్వానికి చెట్లను నరకడం తప్ప.. మొక్కలు నాటాలనే ఆలోచనే రాలేదు. కూటమిది నరికే సంస్కృతి కాదు.. నాటే సంస్కృతి" అని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు అన్నారు. భూమాతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, అది కర్తవ్యమని పేర్కొన్నారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో శనివారం నిర్వహించిన సంప్రదాయ 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు, ఆయన సతీమణి పద్మజ పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రావి--వేప మొక్కలను దంపతులు నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడారు."మనకు పరోక్షంగా జన్మనిచ్చిన తల్లి భూమాత. పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు ఆహారం, నీరు, గాలి, నివాసం సహా అనేక వనరులను ఆమె నుంచే పొందుతున్నాం. మన తల్లిదండ్రులు పెట్టే ప్రతి ఆహారపు ముద్ద వెనుక భూమాత ప్రసాదం ఉంది. అలాంటి భూమాతకు మనం తిరిగి ఏం చేస్తున్నామో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి" అని నాగబాబు అన్నారు.అడవులను నరికివేయడం, విచక్షణారహితంగా మైనింగ్ నిర్వహించడం, ప్రకృతిని కాలుష్యానికి గురిచేయడం ద్వారా మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని రక్షించడం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి కర్తవ్యమని స్పష్టం చేశారు.భారతీయ సంప్రదాయంలో అశ్వత్థ నారాయణ వివాహానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని నాగబాబు తెలిపారు. రావి, వేప చెట్లను ఒకే గుంతలో నాటే ఈ సంప్రదాయం ప్రకృతి, ఆధ్యాత్మికత, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.రావిని విష్ణుమూర్తికి, వేపను లక్ష్మీదేవికి ప్రతీకలుగా భావించడం ద్వారా భారతీయ సంస్కృతిలో ప్రకృతికి ఇచ్చిన ప్రాధాన్యం స్పష్టమవుతుందని వివరించారు.రావి, వేప చెట్లు కలిసి పెరగడం పచ్చదనాన్ని పెంచడంతో పాటు స్వచ్ఛమైన వాతావరణం, జీవ వైవిధ్య పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి వృక్షాలు అనేక జీవరాశులకు ఆవాసాలుగా మారి పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారుఏదైనా మంచి కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు మొక్క నాటడం తనకు అలవాటని నాగబాబు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, తన ఆలోచనల్లో పర్యావరణ పరిరక్షణ విషయంలో సారూప్యత ఉందన్నారు."నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసినప్పుడు పర్యావరణంపై ఆయనకున్న నిబద్ధత మరోసారి స్పష్టమైంది. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే మమ్మల్ని ఒకే ఆలోచనతో ముందుకు తీసుకెళ్తోంది" అని చెప్పారు.గత ప్రభుత్వంపై నాగబాబు విమర్శలు గుప్పించారు. "గత ప్రభుత్వంలో చెట్లను నరకడమే తప్ప.. మొక్కలు నాటాలనే ఆలోచన కనిపించలేదు. ఏ కార్యక్రమం చేపట్టినా అడ్డుగా ఉన్న చెట్లను నరికుకుంటూ వెళ్లారు" అని ఆరోపించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రపంచంలోని పలు దేశాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు. ఒక్కో కుటుంబం కనీసం కొన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే పచ్చదనం పెంపు లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మొక్క నాటడం కంటే దాన్ని బతికించడం, సంరక్షించడం మరింత ముఖ్యమని స్పష్టం చేశారు.ప్రకృతి పరిరక్షణ, అడవుల విస్తరణ, జీవ వైవిధ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తామని నాగబాబు తెలిపారు.కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఎన్. నాగేశ్వరరావు, సీసీఎఫ్ గుంటూరు వై. శ్రీనివాసరెడ్డి, ఏపీ గ్రీన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.ఎన్.ఎన్. మూర్తి, డీఎఫ్ఓ గుంటూరు హిమశైలజ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్యారడైజ్' నుంచి 'యేష నాగుల' సాంగ్ వచ్చేసింది



నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్‌తో అంచనాలను పెంచేసిన ఈ చిత్రం నుంచి మరో సర్ప్రైజ్ వచ్చేసింది. 'యేష నాగుల కట్ట మీద' అంటూ సాగే రెండో పాటను చిత్రబృందం వినూత్నంగా విడుదల చేసి అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తాజాగా యూట్యూబ్ లో ఈ పాటను విడుదల చేశారు.

ఈ పాటను అమెరికాలోని డల్లాస్‌లో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ నిర్వహిస్తున్న లైవ్ కాన్సర్ట్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి నాని 'జడల్' పాత్ర గెటప్‌లో (పొడవాటి జుట్టు, రెక్కల డిజైన్‌తో ఉన్న ప్రత్యేక జాకెట్‌తో) సర్ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అభిమానులను ఉర్రూతలూగించారు. వేదికపై అనిరుధ్‌తో కలిసి నాని వేసిన మాస్ స్టెప్పులకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ సందర్భంగా దిష్టి తగలకుండా సినిమాలోని ఓ డైలాగ్‌ను కూడా నాని ప్రేక్షకులతో చెప్పించి అలరించారు. ఇప్పుడు ఈ పాటను డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లోనూ విడుదల చేశారు.తెలంగాణ జానపదానికి అనిరుధ్ తనదైన శైలిలో మాస్ బీట్స్ జోడించి స్వరపరిచిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, జంగి రెడ్డి, ప్రభ ఆలపించారు. ఈ పాటలో నాని, కీర్తి సురేశ్ కలిసి మాస్ స్టెప్పులతో అదరగొట్టారు. 'దసరా' తర్వాత నాని, కీర్తి, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. పాట విడుదల సందర్భంగా కీర్తి సురేశ్, నాని మధ్య సోషల్ మీడియాలో జరిగిన సరదా సంభాషణ కూడా వైరల్ అయింది.ఈ చిత్రంలో నాని తన భూమి, ప్రజల కోసం పోరాడే శక్తివంతమైన 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. కయాదు లోహర్, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# ఇప్పటివరకూ రాని ప్రేమకథ



శ్రవణ్, మలైకా టి వాసువల్ జంటగా నటిస్తున్న చిత్రం 'చకోరా–లూనార్ లవ్ బర్డ్'. పూరి జగన్నాథ్ శిష్యుడు మంగా శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబర్ 8న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం మోషన్ పోస్టర్‌ను అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ విడుదల చేశారు. ఇప్పటివరకు రానటువంటి విభిన్నమైన కథతో ఈ లవ్‌స్టోరీని తెరకెక్కిస్తున్నామని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని మేకర్స్ తెలిపారు. అనుష్క లూహార్, యామిని, ఎల్.బి.శ్రీరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రుప్ప గోపీకృష్ణ, సంగీతం: ప్రిన్స్ హెన్రీ, రచన–దర్శకత్వం: మంగా శ్రీనివాస్.

# డివైన్ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'



'మూడేళ్లుగా ఈ సినిమాతో ప్రయాణం చేస్తున్నా. అద్భుతమైన అవుట్‌పుట్ వచ్చింది. ఈ సినిమా విజయంపై టీమంతా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అని చెప్పారు సుమంత్. ఆయన కథానాయకుడిగా నటించిన డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని లక్ష్మణ్, కలిపు మధు నిర్మిస్తున్నారు. శనివారం దర్శకుడు వెంకీ అట్లూరి అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను విడుదల చేశారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరి ఉంటుంది వారాహి మాత. అయితే 150 ఏళ్లుగా అక్కడి రాజకుటుంబానికి చెందినవారు 33 ఏళ్ల వయసులోనే మరణిస్తుంటారు. ఈ మరణాలన్నీ వారాహి మాత శాపం కారణంగానే జరుగుతున్నాయని ప్రజలు నమ్ముతుంటారు. ఈ శాపాన్ని ఛేదించి, మరణాల వెనకున్న నిజాల్ని తెలుసుకునే ప్రయత్నంలో కథానాయకుడికి ఎదురైన సవాళ్ల నేపథ్యంలో ట్రైలర్ ఆకట్టుకుంది. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే ఎన్నో మిరాకిల్స్ జరిగాయని, వారాహి అమ్మవారి ఆశీస్సులతో సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఐశ్వర్యరాజేష్, సిద్ధు జొన్నలగడ్డ, మీనాక్షి గోస్వామి, మాల్విక నాయర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్.



# ప్రెగ్నెన్సీపై సమంత ఓపెన్ టాక్..

ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు ప్రస్తుతం తన గర్భధారణ కాలాన్ని పూర్తిస్థాయిలో ఆస్వాదిస్తున్నారు. ఈ ప్రయాణంలోని ప్రతి దశను, తన అనుభవాలను అభిమానులతో, కాబోయే తల్లులతో పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్ నిర్వహించిన ఆమె, తన ప్రెగ్నెన్సీకి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె కొత్త తల్లులు, గర్భవతులతో ముచ్చటించారు."బిడ్డ కోసం అవసరమైన వస్తువులన్నీ కొన్నాను. కానీ, ఇప్పుడు వాటిని చూస్తుంటే కాస్త భయంగా ఉంది" అంటూ సమంత తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సెషన్‌లో ఒక అభిమాని గర్భధారణ సమయంలో బరువు పెరగడం గురించి ప్రస్తావించగా, సమంత బదులిస్తూ.. "మీ బాధ నాకు అర్థమైంది. నేను ఇప్పటికే 11 కిలోలు పెరిగాను" అని తెలిపారు. మరో అభిమాని "బాగా నిద్రపోండి, మీ జీవితం పూర్తిగా మారిపోబోతోంది" అని సలహా ఇవ్వగా, సమంత ఆసక్తికరంగా స్పందించారు.ఇటీవలే తల్లిగా మారిన ఓ యువతి తన దినచర్య గురించి వివరిస్తూ.. "నా బిడ్డకు పాలు పట్టడం, త్రేన్పు తెప్పించడం, జోల పాడటం.. ఇదే రిపీట్ అవుతోంది" అని చెప్పగా, "అది వింటుంటేనే ఒక ఫుల్ టైమ్ ఉద్యోగంలా అనిపిస్తోంది" అని సమంత అన్నారు. బిడ్డకు ఏం పేరు పెట్టాలనుకుంటున్నారని ఒకరు అడగ్గా.. "ఇది నేను ఊహించిన దానికంటే చాలా కష్టంగా ఉంది. బహుశా దీనికి మీ సహాయం అవసరమవుతుంది అనుకుంటున్నాను" అని బదులిచ్చారు.ఈ ప్రెగ్నెన్సీ ప్రయాణాన్ని మీరు ఆస్వాదిస్తున్నారా? అని అడగ్గా, "మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తున్నాను" అని ఆమె ఒప్పుకున్నారు. మాతృత్వానికి ఎలాంటి మాన్యువల్ ఉండదని ఒక అభిమాని చెప్పగా, "అది నిజమే. మాతృత్వం చాలా అందమైన, మాయతో కూడిన, జీవితాన్ని మార్చే అనుభవం. అయితే, దీనికోసం ఒక మాన్యువల్ ఉంటే బాగుండేది" అని సమంత సరదాగా వ్యాఖ్యానించారు. ఈ ప్రయాణం తనను ఎంతో శక్తిమంతంగా మార్చిందని, మొదట తాను ఎక్కువగా కంగారు పడతానని అనుకున్నానని ఆమె పేర్కొన్నారు.

# గంగ ఒక్కడే.. ప్రాణాలు ఐదు



శర్వానంద్ తాజా చిత్రం 'భోగి' నిర్మాణ దశలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. 1960 ఉత్తర తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు నేపథ్య కథాంశంతో దర్శకుడు సంపత్‌నంది ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. శనివారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'గంగ ఒక్కడే..ప్రాణాలు ఐదు' అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ఈ పోస్టర్ పల్లెటూరి వాతావరణానికి, కుటుంబ బంధాలకు అద్దం పడుతున్నది.ఈ సినిమాలో శర్వానంద్ గంగ అనే పల్లెటూరి యువకుడి పాత్రలో కనిపించనున్నారు. స్పెషల్ పోస్టర్‌లో హీరో గంగ..తన తోబుట్టువులకు తాటి ముంజలు అందిస్తున్నారు. బలమైన కుటుంబ భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని పోస్టర్‌ని బట్టి అర్థమవుతున్నది. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాత: కె.కె.రాధామోహన్, రచన–దర్శకత్వం: సంపత్‌నంది.



# 'టాక్సిక్' ఫలితంపై నయనతార స్పందన

కన్నడ రాకింగ్ స్టార్ యశ్, నయనతార తదితరులు నటించిన చిత్రం 'టాక్సిక్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనలు అందుకుంటోంది. ఈ సినిమాపై సోషల్ మీడియాలో రకరకాల విమర్శలు వస్తున్న నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నయనతార స్పందించారు.సినిమా ఫలితాల గురించి మాట్లాడుతూ... "పరిశ్రమలో ఉన్న అనుభవం ఒక సినిమాను ఎలా తీస్తారనే దానిపై ప్రాథమిక అవగాహన ఇస్తుంది కానీ, సినిమా అనేది ఎంతో భావోద్వేగభరితమైనది, ఊహించని మలుపులతో కూడుకున్నది. నా కెరీర్‌లో కచ్చితంగా పెద్ద హిట్ అవుతాయని కొండంత ఆశలు పెట్టుకున్న కొన్ని సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. అదే సమయంలో, కొన్ని చిత్రాల ఫలితంపై నాకే సందేహాలు ఉండేవి కానీ, అవి బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో భారీ విజయాలు సాధించి ఆశ్చర్యపరిచాయి" అని తెలిపారు.ఈ ఒడిదొడుకుల నుంచి తాను నేర్చుకున్న ముఖ్యమైన పాఠం గురించి చెబుతూ... "చిత్ర పరిశ్రమలో నా ఇన్నేళ్ల ప్రయాణం ఒక విషయాన్ని నేర్పింది. సినిమా విజయమైనా, అపజయమైనా రెండింటినీ ఒకే విధంగా, వినయంతో స్వీకరించడం నేను నేర్చుకున్నాను" అని స్పష్టం చేశారు.

# ప్రతీ విషయంలో వివక్షే!



కథానాయిక తాప్సీకి వివాదాలు కొత్తేమి కాదు. ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేయడం ఈ భామ నైజం. తాజాగా ఇండస్ట్రీలో కథానాయికలపై చూపించే వివక్ష గురించి తాప్సీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా కెరీర్ ఆరంభంలో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని పంచుకుంది. 'షూటింగ్ టైంలో హీరోయిన్స్ కొన్ని గంటల ముందే సెట్స్‌కి రావాల్సి ఉంటుంది. ఆ తర్వాతే హీరోలు వస్తారు. మాకు సమకూర్చే వసతులు కూడా అంతంత మాత్రమే ఉంటాయి. కెరీర్ ఆరంభంలో ఓ సినిమాలో నాపై భారీ స్థాయిలో ఓ ఇంట్రడక్షన్ సీన్ తీశారు. కానీ తర్వాత ఆ సన్నివేశాన్ని మొత్తం తొలగించారు. దర్శకుడిని ఆరా తీస్తే.. హీరో చెప్పడం వల్లే ఆ సీన్‌ను తీసివేశారని తెలిసింది. అదే సినిమాలో ఓ డైలాగ్‌ని మార్చడానికి నేను అంగీకరించలేదు. కావాలంటే మ్యూట్ చేయండి అని చెప్పాను. థియేటర్‌లో చూస్తే ఆ ఒక్క సంభాషణను మార్చి వేరే డబ్బింగ్ ఆర్టిస్టుతో చెప్పించారు. ఇలా చాలా విషయాల్లో హీరోయిన్లపై వివక్ష చూపిస్తారు' అని చెప్పుకొచ్చింది తాప్సీ.

# పాదయాత్ర విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ శిరసు వంచి నమస్కారాలు

**- రోడ్డు పూర్తయ్యే వరకు ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తాం**

**- మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మా దేవేందర్‌రెడ్డి**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** నందగోకుల్--చెల్మెడ కమాన్ రహదారి కోసం చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మా దేవేందర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్రకు భారీగా తరలివచ్చి మద్దతు తెలిపిన ప్రజలకు శిరసు వంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు, రైతులకు, మహిళలకు, యువతకు, విద్యార్థులకు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రజల సమస్య కోసం నిర్వహించిన పాదయాత్రకు ఇంతటి భారీ స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్య తీవ్రతను ఈ పాదయాత్ర ప్రభుత్వానికి మరోసారి తెలియజేసిందన్నారు.నందగోకుల్--చెల్మెడ కమాన్ రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు."ప్రజల కోసం చేపట్టిన ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదు. రోడ్డు పూర్తయ్యే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల అండతో అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తాం" అని అన్నారు. పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఐక్యతే ఈ ఉద్యమానికి బలమని, రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు అందరూ ఇదే ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలకు యుడిఐడి తప్పనిసరి

**- డిసిహెచ్ శివదయాల్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) దివ్యాంగుల సాధికార తే లక్ష్యంగా యూడీ.ఐ.డీ (UDID) శిబిరం నిర్వహించడం జరిగిందని డి సి హెచ్ ఎస్ డాక్టర్ శివ దయాల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శనివారం దివ్యాంగుల యూడీ.ఐ.డీ (UDID) శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.సీహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్ మాట్లాడుతూ...మెదక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో UDID శిబిరం మెదక్, ఆగస్టు 29, 2026: మెదక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగుల కోసం యూనిక్ డిజెబిలిటీ ఐడీ (UDID) కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా శనివారం (UDID) శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో మొత్తం 175 స్లాట్లు కేటాయించగా, 147 మంది దివ్యాంగులు హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు.**విభాగాల వారీగా హాజరు వివరాలు:** లోకోమోటర్ డిజెబిలిటీ: 66 మంది జనరల్ మెడిసిన్: 26 మంది కంటి వైద్య విభాగం (ఆప్తాల్మాలజీ): 18 మంది ఈఎన్‌టీ విభాగం: 20 మంది సైకియాట్రీ: 12 మందిపీడియాట్రిక్స్: 05 మంది శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన వైద్యులు దివ్యాంగులను పరీక్షించి, వారి వైకల్య శాతాన్ని నిర్ధారించే ప్రక్రియను నిర్వహించారు. అర్హులైన వారికి UDID కార్డుల జారీకి అవసరమైన ప్రక్రియను పూర్తి చేశారు.ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సౌకర్యాలు సులభంగా అందేలా UDID కార్డు ప్రాముఖ్యత ఉందన్నారు.

## ఎస్ ఐ ఆర్ హియరింగ్‌కు వచ్చిన ప్రజల్లో గందరగోళం


**- పత్రాలపై స్పష్టత లేక ఆందోళన.. అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎస్సైఆర్ (సర్) హియరింగ్ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 119, 120, 121 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ప్రజలు హియరింగ్‌కు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.అయితే హియరింగ్‌కు హాజరైన ప్రజలు ఎలాంటి పత్రాలు సమర్పించాలి, ఏయే ధ్రువపత్రాలు తీసుకురావాలి అనే అంశంపై అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం అందకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారని ప్రజలు తెలిపారు. తమకు అవసరమైన పత్రాలపై స్పష్టత లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గజ్వేల్‌కు సంబంధించిన ఎన్నికల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజలకు పూర్తి సమాచారం అందించాలని, హియరింగ్‌కు హాజరయ్యే వారి కోసం అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసి, అవసరమైన పత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని ప్రజలు కోరుతున్నారు.అధికారులు స్పందించి తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రజల్లో నెలకొన్న అపోహలు, భయాందోళనలను తొలగించి ఎస్సైఆర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మ్యారేజ్ బ్యూరోలు..

# పెళ్లి సంబంధాలా.? డబ్బు దందాలా.?



**- జీవిత భాగస్వామి కోసం వెతికే కుటుంబాలే టార్గెట్టా.?**

**- రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి 'సర్వీస్ ఛార్జీ' వరకు పారదర్శకతపై ప్రశ్నలు**

**- బయోడేటాల మాటున వ్యక్తిగత సమాచారం భద్రమేనా.?**

**- తప్పుడు ప్రొఫైళ్లు, నకిలీ హామీలపై పర్యవేక్షణ ఏదీ.?**

**- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మ్యారేజ్ బ్యూరోలు పేరిట అక్రమాలు పై ప్రత్యేక కథనం**

పెళ్లి.. ప్రతి కుటుంబానికి జీవితంలో అత్యంత కీలకమైన నిర్ణయం. తమ పిల్లలకు మంచి జీవిత భాగస్వామి దొరకాలని తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. విద్య, ఉద్యోగం, కుటుంబ నేపథ్యం, ఆర్థిక స్థితి, వ్యక్తిత్వం.. ఇలా ఎన్నో అంశాలను పరిశీలించి సంబంధం ఖరారు చేసుకోవాలని భావిస్తారు. ఈ అవసరాన్నే వ్యాపార అవకాశంగా మలుచుకుంటున్నాయన్న ఆరోపణలు కొన్ని మ్యారేజ్ బ్యూరోలపై వినిపిస్తున్నాయి. సంబంధాల కోసం వచ్చే కుటుంబాల నుంచి రిజిస్ట్రేషన్ ఫీజులు, సేవా రుసుములు, ప్రొఫైల్ ఛార్జీలు తదితర పేర్లతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.సంబంధం కుదిరితే ఒక రకమైన రుసుము.. కుదరకపోతే మరో రకమైన సమాధానం.. మరిన్ని సంబంధాలు చూపిస్తామని అదనపు చెల్లింపులు.. ఇలా కొన్ని సంస్థల వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు మ్యారేజ్ బ్యూరో అంటే ఏమిటి? వారి బాధ్యత ఎంతవరకు.? కస్టమర్ నుంచి డబ్బు తీసుకున్న తర్వాత సేవల పరిధి ఏమిటి? సంబంధం చూపించడం మాత్రమేనా.? లేక ఇచ్చే సమాచారాన్ని ధ్రువీకరించే బాధ్యత కూడా ఉందా.? అన్నది స్పష్టత అవసరమైన అంశంగా మారింది.

### పెళ్లి సంబంధమా.. వ్యాపార సంబంధమా.?

జీవిత భాగస్వామి కోసం మ్యారేజ్ బ్యూరోను ఆశ్రయించే కుటుంబాలు సాధారణంగా నమ్మకంతో తమ వ్యక్తిగత సమాచారాన్ని అందిస్తాయి. పేరు, వయసు, విద్యార్హతలు, ఉద్యోగం, ఆదాయం, కుటుంబ వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్, ఫొటోలు వంటి సమాచారం అందులో ఉంటుంది.ఈ సమాచారం ఎంత భద్రంగా ఉంటుంది.? ఎవరి చేతుల్లోకి వెళుంది.? ఇతరులకు అనుమతి లేకుండా పంచుతున్నారా.? ప్రొఫైల్ తొలగించిన తర్వాత డేటా పూర్తిగా తొలగిస్తారా.? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.పెళ్లి సంబంధం కోసం ఇచ్చిన సమాచారం వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించకుండా ఉండేందుకు స్పష్టమైన విధానం ఉండాలి. వినియోగదారులకు ఆ విధానం ముందుగానే తెలియజేయాలి.

### '100 శాతం గ్యారంటీ'.. అసలు సాధ్యమేనా.?

కొన్ని సంస్థలు ఆకర్షణీయమైన ప్రకటనలతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. 'మంచి సంబంధాలు', 'వెరిఫైడ్ ప్రొఫైల్స్', 'త్వరిత వివాహం', 'ప్రత్యేక సంబంధాలు' వంటి ప్రచార పదజాలంతో కుటుంబాలను ఆకర్షించడం సాధారణంగా మారింది.కానీ ఒక సంబంధం నిజంగా వివాహానికి దారితీస్తుందా.? అది ఎవరి నియంత్రణలో ఉంటుంది.? కుటుంబాల నిర్ణయాలు, వ్యక్తుల అభిప్రాయాలు, సామాజిక పరిస్థితులు, ఇతర అనేక అంశాలు వివాహ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి.అందువల్ల 'వివాహం గ్యారంటీ' వంటి ప్రచారాల వెనుక వాస్తవం ఏమిటి.? అన్నది వినియోగదారులు తెలుసుకోవాల్సిన అంశం.

### రిజిస్ట్రేషన్ ఫీజు.. మళ్లీ సర్వీస్ ఛార్జీ

మ్యారేజ్ బ్యూరోలపై వినిపించే ప్రధాన ఫిర్యాదుల్లో ఫీజుల పారదర్శకత ఒకటి. మొదట రిజిస్ట్రేషన్ కోసం ఒక మొత్తం చెప్పి.. ఆ తర్వాత అదనపు సేవల పేరుతో మరిన్ని మొత్తాలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.ప్రొఫైల్ తయారీ, ఫొటో ఎంపిక, ప్రత్యేక సంబంధాలు, సంప్రదింపు వివరాలు, సమావేశాల ఏర్పాట్లు వంటి పేర్లతో అదనపు రుసుములు వసూలు చేస్తున్న సంస్థలు ఉంటే.. ఆ సేవలకు ముందుగానే ధరలు వెల్లడించాల్సిన అవసరం ఉంది.ఏ సేవకు ఎంత.? మొత్తం ప్యాకేజీ ఎంత.? రిఫండ్ నిబంధనలు ఏమిటి.? అనే వివరాలు రాతపూర్వకంగా ఇవ్వాలి.

### సంబంధం కుదరకపోతే డబ్బు సంగతేంటి.?

ఒక కుటుంబం మ్యారేజ్ బ్యూరోకు డబ్బు చెల్లించిన తర్వాత సంబంధం కుదరకపోతే ఏం జరుగుతుంది.? ఫీజు తిరిగి ఇస్తారా.? లేక ఒకసారి చెల్లించిన తర్వాత తిరిగి ఇవ్వమంటారా.?రిఫండ్ పాలసీని ముందుగానే స్పష్టంగా చెప్పకపోతే తర్వాత వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. వినియోగదారులు చెల్లించే ప్రతి రూపాయికి రసీదు ఇవ్వడం, సేవల వివరాలను రాతపూర్వకంగా అందించడం అవసరం.రసీదు లేని చెల్లింపులు.. వివాదం వచ్చినప్పుడు ఆధారం లేకుండా చేసే పరిస్థితి తలెత్తవచ్చన్నది వినియోగదారుల ఆందోళన.

### బయోడేటా వెనుక అసలు కథ ఏమిటి.?

మ్యారేజ్ బ్యూరోలో నమోదయ్యే ప్రతి ప్రొఫైల్ నిజమైనదేనా.? అందులో పేర్కొన్న ఉద్యోగం, విద్యార్హతలు, ఆదాయం, ఆస్తులు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను ఎవరైనా ధ్రువీకరిస్తున్నారా.?ఒక వ్యక్తి తన గురించి తప్పుడు సమాచారం ఇచ్చినా.. అది ధ్రువీకరించకుండా మరో కుటుంబానికి పంపితే తర్వాత ఏర్పడే సమస్యలకు ఎవరు బాధ్యత వహిస్తారు.?మ్యారేజ్ బ్యూరోలు 'సంబంధాలు చూపించే సంస్థలు' మాత్రమేనా.? లేక 'వెరిఫైడ్ సంబంధాలు' అని ప్రచారం చేస్తే వాటిని నిజంగా ధ్రువీకరించే బాధ్యత తీసుకుంటున్నారా.? అన్నది కీలక ప్రశ్న.

### నకిలీ ప్రొఫైళ్ల ముప్పు..

ఆన్‌లైన్ కాలంలో నకిలీ పేర్లు, తప్పుడు ఫొటోలు, కల్పిత ఉద్యోగ వివరాలతో ప్రొఫైళ్లు సృష్టించడం కష్టమైన పని కాదు. ఇలాంటి ప్రొఫైళ్లను గుర్తించేందుకు సంస్థలు ఏమైనా ధ్రువీకరణ ప్రక్రియ పాటిస్తున్నాయా.?ఆధార్, విద్యా ధ్రువపత్రాలు, ఉద్యోగ వివరాలు వంటి వ్యక్తిగత పత్రాలను సేకరించడం జరిగితే వాటి భద్రత మరింత ముఖ్యమవుతుంది. పత్రాలు సేకరించడం మాత్రమే కాకుండా వాటిని ఎలా భద్రపరుస్తున్నారు.? ఎవరికి యాక్సెస్ ఉంటుంది.? ఎప్పుడు తొలగిస్తారు.? అనే అంశాలపై స్పష్టమైన విధానం అవసరం.

### ఒకే ప్రొఫైల్.. పలువురికి..

కొన్ని మ్యారేజ్ బ్యూరోలపై వినిపించే మరో ప్రశ్న.. ఒకే ప్రొఫైల్‌ను పలువురు కుటుంబాలకు చూపించి వేర్వేరు సేవా రుసుములు వసూలు చేస్తున్నారా.? అన్నది.
ఇది వాస్తవమైతే వినియోగదారులకు పారదర్శకత లేకపోవడమే అవుతుంది. ఒక ప్రొఫైల్ అందుబాటులో ఉందా.? ఇప్పటికే సంబంధం కొనసాగుతోందా.? సంబంధం తిరస్కరించబడిందా.? వివాహం జరిగిపోయిందా.? వంటి వివరాలను సంస్థలు ఎప్పటికప్పుడు నవీకరించాల్సిన అవసరం ఉంది.

### ఫొటోలు.. వ్యక్తిగత సమాచారానికి రక్షణ ఉందా.?

పెళ్లి సంబంధం కోసం ఇచ్చే ఫొటోలు సాధారణ ఫొటోలు కావు. వాటితో పాటు కుటుంబ వివరాలు, ఫోన్ నంబర్లు, ఉద్యోగ సమాచారం వంటి అంశాలు ఉంటాయి.ఈ డేటా ఇతర సోషల్ మీడియా గ్రూపుల్లోకి వెళ్లినా.. అనధికారికంగా ప్రచారం జరిగినా.. బాధితులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.అందువల్ల డేటా సేకరణకు ముందు అనుమతి.. వినియోగానికి స్పష్టమైన నిబంధనలు.. మూడో వ్యక్తికి ఇవ్వాలంటే సమ్మతి.. డేటా తొలగింపుపై హక్కు వంటి అంశాలు స్పష్టంగా ఉండాలి.

### ఆన్‌లైన్ ప్రకటనలు.. ఆఫ్‌లైన్ వాస్తవాలు

సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లు, వాట్సాప్ గ్రూపుల్లో ఆకర్షణీయమైన ప్రకటనలు కనిపిస్తున్నాయి. 'వెయ్యిలాది సంబంధాలు', 'వెరిఫైడ్ ప్రొఫైల్స్', 'ప్రత్యేక వర్గాల సంబంధాలు' అంటూ ప్రచారం చేస్తున్న సంస్థలు తమ గణాంకాలకు ఆధారం చూపుతున్నాయా.?ప్రకటనలో చెప్పిన సేవ కార్యాలయంలో వాస్తవంగా అందుతున్నదా? సంస్థకు సరైన కార్యాలయ చిరునామా ఉందా.? యాజమాన్య వివరాలు వెల్లడిస్తున్నారా.? ఫీజుల నిబంధనలు స్పష్టంగా ఉన్నాయా? వంటి విషయాలను వినియోగదారులు పరిశీలించాలి.

### మ్యారేజ్ బ్యూరోనా.. డేటా సెంటరా.?

ఇది అత్యంత కీలకమైన ప్రశ్న.వేలాది కుటుంబాల వ్యక్తిగత వివరాలు ఒకే సంస్థ వద్ద ఉంటే.. వాటి భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. ముఖ్యంగా యువతీ యువకుల ఫొటోలు, ఫోన్ నంబర్లు, ఉద్యోగ వివరాలు, కుటుంబ నేపథ్యం వంటి సమాచారం బయటకు వెళ్తే దుర్వినియోగానికి అవకాశం ఉంటుంది.అందుకే మ్యారేజ్ బ్యూరోల నిర్వహణలో డేటా భద్రతను ఒక ప్రధాన బాధ్యతగా పరిగణించాల్సిన అవసరం ఉంది.

### ఫీజుల పట్టిక ఎందుకు ఉండకూడదు.?

ఒక మ్యారేజ్ బ్యూరోకు వెళ్లిన వ్యక్తికి అక్కడి సేవల గురించి ముందుగానే స్పష్టత ఉండాలి.రిజిస్ట్రేషన్ -- ఇంత ప్రొఫైల్ సేవ -- ఇంత ప్రత్యేక సంబంధాల సేవ -- ఇంత
ఇతర సేవలు -- ఇంత రిఫండ్ నిబంధనలు -- ఇవి అనే విధంగా ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శిస్తే అనుమానాలకు తావుండదు. 'మాట మీద ఫీజు' కంటే 'రాతలో ఫీజు' ఉంటేనే పారదర్శకత.

### రసీదు లేకుండా నగదు లావాదేవీలపై ప్రశ్నలు

సేవలకు చెల్లించే ప్రతి మొత్తానికి రసీదు ఇవ్వడం వినియోగదారుడి హక్కులకు రక్షణ కల్పిస్తుంది. రసీదు లేకుండా చెల్లించిన మొత్తంపై తర్వాత వివాదం వస్తే ఇరువర్గాల మధ్య సమస్య తలెత్తే అవకాశం ఉంది.అందువల్ల డిజిటల్ చెల్లింపులు, రసీదులు, ఒప్పంద పత్రాలు వంటి పారదర్శక విధానాలను పాటించడం సంస్థలకు కూడా రక్షణే.

### బాధితులు ఎక్కడికి వెళ్లాలి.?

సంబంధం పేరుతో మోసం జరిగిందని అనిపిస్తే.. తప్పుడు సమాచారం ఇచ్చారని తేలితే.. వ్యక్తిగత డేటా దుర్వినియోగమైందని అనుమానం వస్తే.. అధిక రుసుములు వసూలు చేశారని ఫిర్యాదు ఉంటే బాధితులు ఎక్కడ ఫిర్యాదు చేయాలి.?ప్రతి మ్యారేజ్ బ్యూరో తమ కార్యాలయంలో ఫిర్యాదు పరిష్కార విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలి. సంస్థ యాజమాన్యం, సంప్రదింపు వివరాలు, ఫిర్యాదు అధికారి వివరాలు అందుబాటులో ఉండాలి.మోసం లేదా సైబర్ దుర్వినియోగం జరిగిన సందర్భాల్లో సంబంధిత చట్టపరమైన సంస్థలను ఆశ్రయించడం కూడా అవసరం.

### పెళ్లి ఆశను వ్యాపార వస్తువుగా మార్చొద్దు

పెళ్లి అనేది కుటుంబాల భావోద్వేగాలతో ముడిపడి ఉంటుంది. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధపడే పరిస్థితి ఉంటుంది. అలాంటి పరిస్థితిని ఎవరైనా వ్యాపార ప్రయోజనాలకు దుర్వినియోగం చేస్తే అది తీవ్ర ఆందోళన కలిగించే అంశమే.
మ్యారేజ్ బ్యూరోలు సేవలు అందించడం తప్పు కాదు. సంబంధాలను పరిచయం చేయడం, కుటుంబాలను కలపడం సమాజంలో అవసరమైన సేవే. కానీ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, సమాచారాన్ని రక్షించడం, ఫీజుల్లో పారదర్శకత పాటించడం, తప్పుడు హామీలు ఇవ్వకపోవడం, ఫిర్యాదులను పరిష్కరించడం కూడా అంతే అవసరం.

### ప్రభుత్వ పర్యవేక్షణ అవసరమా.?

మ్యారేజ్ బ్యూరోల వ్యవహారశైలిపై ఫిర్యాదులు పెరుగుతున్నాయంటే సంబంధిత విభాగాలు పరిస్థితిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. సంస్థల నమోదు, కార్యాలయ వివరాలు, వినియోగదారులకు అందించే సేవలు, ఫీజుల పారదర్శకత, డేటా రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించడం అవసరం.అన్ని మ్యారేజ్ బ్యూరోలను ఒకే గాటన కట్టడం సరికాదు. నిజాయితీగా సేవలు అందించే సంస్థలు కూడా ఉన్నాయి. అయితే కొద్దిమంది కారణంగా మొత్తం రంగంపై అనుమానాలు రావడం ఆ రంగానికే నష్టం.ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలిమ్యారేజ్ బ్యూరోను ఆశ్రయించే ముందు సంస్థ గురించి తెలుసుకోవాలి. కార్యాలయ చిరునామా, ఫీజు వివరాలు, రసీదు, సేవల నిబంధనలు, రిఫండ్ పాలసీ వంటి అంశాలను ముందుగానే తెలుసుకోవాలి.ఎవరైనా వ్యక్తి గురించి బ్యూరో సమాచారం ఇచ్చిందని మాత్రమే నమ్మి వివాహ నిర్ణయం తీసుకోకూడదు.
ఉద్యోగం, విద్యార్హత, కుటుంబ నేపథ్యం, ఆర్థిక వివరాలు వంటి అంశాలను కుటుంబ స్థాయిలో స్వతంత్రంగా ధ్రువీకరించుకోవడం అత్యంత అవసరం.మ్యారేజ్ బ్యూరో అనేది సంబంధం చూపించే వేదిక మాత్రమే.. జీవిత భాగస్వామిని నిర్ణయించే సంస్థ కాదు. అందుకే బ్యూరో ఇచ్చే సమాచారాన్ని తుది నిజంగా భావించకుండా కుటుంబాలు కూడా జాగ్రత్త వహించాలి.అదే సమయంలో సేవల పేరుతో డబ్బు తీసుకునే సంస్థలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. ఫీజుల్లో పారదర్శకత ఉండాలి.. రసీదులు ఇవ్వాలి.. తప్పుడు హామీలు ఉండకూడదు.. నకిలీ ప్రొఫైళ్లకు చోటు ఉండకూడదు.. వ్యక్తిగత డేటాకు రక్షణ ఉండాలి.. ఫిర్యాదులకు స్పందన ఉండాలి.పెళ్లి సంబంధం కోసం వచ్చిన కుటుంబం.. ఒక కస్టమర్ మాత్రమే కాదు. ఒకరి జీవిత భవిష్యత్తును మీ చేతుల్లో పెట్టి వచ్చిన కుటుంబం. ఆ నమ్మకాన్ని డబ్బుతో కొలిస్తే.. సంబంధాల రంగానికే మచ్చ.మ్యారేజ్ బ్యూరోలపై పర్యవేక్షణ పెరగాలి.. పారదర్శకత రావాలి.. మోసాలకు అడ్డుకట్ట పడాలి. పెళ్లి ఆశతో వచ్చే కుటుంబాలకు 'సంబంధం' కావాలి.. 'సందేహం' కాదు

# డా. సుల్తాన ఉమర్‌కు ఘన సన్మానం

**- సామాజిక సేవలకు గుర్తింపుగా డాక్టరేట్, సేవారత్న అవార్డు, బంగారు పతకం**

**- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** నిరుపేదలు, అనాథలు, అభాగ్యులకు అండగా నిలుస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు న్యూ లైఫ్ థీయాలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో పాటు మదర్ థెరిసా సేవారత్న అవార్డు, బంగారు పతకం అందజేయడం అభినందనీయమని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు.శనివారం డా. సుల్తాన ఉమర్ నివాసంలో ఆమెను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పి. శంకర్ మాట్లాడుతూ.. సామాజిక సేవను బాధ్యతగా భావించి ఎన్నో ఏళ్లుగా పేదలు, అనాథలు, నిరుపేద కుటుంబాలకు తనవంతు సహాయాన్ని అందిస్తున్న సోషల్ రిఫార్మేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు డా. సుల్తాన ఉమర్ సేవలు అభినందనీయమని అన్నారు.పేదలు, అనాథలు, నిరాశ్రయులకు అండగా నిలుస్తూ మానవతా దృక్పథంతో ఆమె కొనసాగిస్తున్న సేవలు నేటి తరానికి, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.డా. సుల్తాన ఉమర్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని పి. శంకర్ ఆకాంక్షించారు. ఆమెకు లభించిన గౌరవాల పట్ల డీబీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అంతరావుపల్లి ఉపసర్పంచ్ బైరం రమేష్, నాయకులు సతీష్, గణేష్, దాసరి హరిబాబు, ధార మల్లేష్, పుట్ట రాజు, గద్ద నరేష్, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కుళ్లిన మాంసం..

## కాసుల కోసం కక్కుర్తి



- పలమనేరులో హోటళ్లపై మున్సిపల్ అధికారుల కొరడా
- ఆకస్మిక తనిఖీల్లో కుళ్లిన చికెన్, మటన్ గుర్తింపు.
- యజమానులకు జరిమానాలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే హోటళ్లు సీజ్ చేస్తాం: మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక




**పలమనేరు(ప్రశ్న న్యూస్)** ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాసుల కోసం నాసిరకం ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారా? హోటళ్లలో పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా? మాంసాహార పదార్థాలను తాజాగా నిల్వ చేస్తున్నారా? లేక రోజుల తరబడి నిల్వ ఉంచిన కుళ్లిన మాంసాన్నే వండిపెడుతున్నారా? పలమనేరులో మున్సిపల్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు ఈ ప్రశ్నలను తెరపైకి తెచ్చాయి. పట్టణంలోని పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, ఒకటి కంటే ఎక్కువ హోటళ్లలో కుళ్లిన చికెన్, మటన్ గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీంతో హోటల్ నిర్వాహకులపై జరిమానాలు విధించారు. ప్రజలకు నాణ్యత లేని, ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారం విక్రయిస్తే ఇకపై ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేశారు. తనిఖీలతో వెలుగులోకి..పలమనేరు పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. సాధారణంగా హోటల్ బయట శుభ్రంగా కనిపించినా.. వంటగదిలో పరిస్థితి ఎలా ఉంది? మాంసాన్ని ఏ విధంగా నిల్వ చేస్తున్నారు? వండని పదార్థాలను ఎక్కడ ఉంచుతున్నారు? వంట పాత్రలు, ఫ్రిజ్‌లు, నిల్వ ప్రదేశాల పరిశుభ్రత ఎలా ఉంది? వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో కొన్ని హోటళ్లలో కుళ్లిన చికెన్, మటన్ ఉన్నట్లు గుర్తించారు. ప్రజలకు అందించే ఆహార పదార్థాల విషయంలో ఇలాంటి నిర్లక్ష్యం తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.




### నిన్నటి మాంసం.. నేటి వంటకమా?

హోటళ్లలో మాంసాహార వంటకాలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. చికెన్, మటన్ వంటకాలు రోజువారీగా పెద్ద మొత్తంలో విక్రయమవుతుంటాయి. ఈ నేపథ్యంలో మిగిలిపోయిన మాంసాన్ని మరుసటి రోజుకు నిల్వ ఉంచి విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మాంసాన్ని సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయకపోతే బ్యాక్టీరియా, సూక్ష్మజీవుల పెరుగుదలకు అవకాశం ఉంటుంది. అలాంటి ఆహారం తీసుకోవడం వల్ల ఆహార విషబాధ, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే మాంసం నిల్వ, వంట ప్రక్రియ, మిగిలిపోయిన ఆహార పదార్థాల నిర్వహణ విషయంలో హోటల్ యాజమాన్యాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది.

### జరిమానాతో సరిపెట్టొద్దు..

తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన హోటళ్ల యజమానులకు మున్సిపల్ అధికారులు జరిమానాలు విధించారు. అయితే జరిమానా చెల్లించి మళ్లీ అదే విధంగా వ్యవహరిస్తే ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఒకసారి పట్టుబడిన తర్వాత కూడా నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. హోటళ్లపై నిరంతర తనిఖీలు నిర్వహించి, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్నది పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

### హోటళ్లపై నిరంతర నిఘా అవసరం

పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు పెరుగుతున్న కొద్దీ ఆహార నాణ్యతపై పర్యవేక్షణ కూడా పెరగాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మాంసాహార పదార్థాలు విక్రయించే హోటళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే తనిఖీలు చేయకుండా.. ముందస్తు హెచ్చరిక లేకుండా తరచూ తనిఖీలు నిర్వహిస్తేనే నిబంధనల ఉల్లంఘనలను అరికట్టవచ్చని చెబుతున్నారు.

హోటల్ వంటగది, ఫ్రిజ్‌లు, మాంసం నిల్వ చేసే ప్రదేశాలు, నీటి నాణ్యత, వ్యర్థాల నిర్వహణ, ఆహార పదార్థాల గడువు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

### వినియోగదారులూ అప్రమత్తంగా ఉండాలి

ఆహార నాణ్యత విషయంలో అధికారుల చర్యలతో పాటు వినియోగదారుల అప్రమత్తత కూడా అవసరం. ఆహారం వాసన, రుచి, రంగు అనుమానాస్పదంగా ఉంటే దానిని తీసుకోకుండా హోటల్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లాలి. అనుమానాస్పద ఆహారం అందించినట్లు భావిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు అధికారులకు కూడా తనిఖీలను లక్ష్యంగా నిర్వహించేందుకు ఉపయోగపడతాయి.

ఆరు నెలలుగా కొనసాగుతున్న

# మధ్యప్రాచ్య సంక్షోభం

**- గల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400 నౌకలు, వాటిలోని దాదాపు 6,000 మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) శుక్రవారం వెల్లడించింది. ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగినప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఈ అంతరాయం కారణంగా ఇంధనం, ఎరువులు వంటి నిత్యావసర వస్తువుల ప్రపంచ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 28న ఈ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ నౌకాయానంపై కనీసం 70 దాడులు జరిగినట్లు ఐఎంఓ ధృవీకరించింది. ఈ దాడుల్లో 19 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ జలసంధుల గుండా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని జూలైలో ఐఎంఓ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ జలమార్గంలో నౌకాయానాన్ని పునరుద్ధరించడానికి సభ్య దేశాలన్నీ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చింది. ఈ సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనేందుకు సభ్య దేశాలు, షిప్పింగ్ పరిశ్రమ కలిసి పనిచేయాలని డొమింగ్యూజ్ కోరారు. మరోవైపు, నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ వంటి ప్రాంతాల్లో కూడా సముద్ర భద్రత క్షీణిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులతో మొదలైన ఈ వివాదంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, నౌకాయానం, ఇరాన్ అణు కార్యక్రమం, అంతర్జాతీయ ఆంక్షల వంటి అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది.

# ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్ట్ పునరుజ్జీవనానికి కీలక అడుగు

**- 152 మీటర్లకు ప్రతిపాదన**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఎంఐఎం నుంచి బహిష్కరణ..

# అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను ఎంఐఎం పార్టీ నుంచి బహిష్కరించడం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర వీడియోలు వైరల్ కావడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే, ఆ వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ కుట్రకు పాల్పడ్డారని రహ్మత్ బేగ్ ఆరోపించారు. పార్టీ బహిష్కరణకు ముందే తన కుటుంబంతో కలిసి మక్కా వెళ్లిన రహ్మత్ బేగ్, అక్కడి నుంచే ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులు ఫోన్ చేసి సోషల్ మీడియాలో కొన్ని అశ్లీల వీడియోలు వైరల్ అవుతున్నట్లు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. ఆ వీడియోలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే తనపై కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీని, పార్టీ అధినేతలు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల ప్రతిష్ఠను దిగజార్చేందుకే ఈ డీప్ ఫేక్ వీడియోలను సృష్టించారని ఆయన వివరించారు. ఈ అంశంపై తాను ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగంతో పాటు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని రహ్మత్ బేగ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 28వ తేదీ రాత్రి ఎంఐఎం అధిష్ఠానం ఆయనను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. శాసనమండలి సభ్యత్వానికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. తాజా పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఇతర రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.



# గుంటూరు మేయర్ పీఠం..

## 'పుర'పోరుకు ముందే

# ప్రకంపనలు

- పీఠం ఒక్కటే.. ఆశావహులు ఎందరో
- కూటమిలోనే హోరాహోరీ లెక్కలు.. - ప్రతిపక్షం వ్యూహాత్మక అడుగులు
- కార్పొరేటర్ల బలం కంటే ప్రజాబలమే కీలకమయ్యేనా.?
- సామాజిక సమీకరణాలు.. వ్యక్తిగత ఇమేజ్..
- అధిష్ఠానం వ్యూహమే తుది అస్త్రం

**గుంటూరు (ప్రశ్న న్యూస్)** గుంటూరు నగర రాజకీయాల్లో మళ్లీ వేడి రాజుకుంటోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీల దృష్టి కేంద్రీకృతమవుతున్న తరుణంలో.. నగర మేయర్ పీఠం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. పీఠం ఒక్కటే అయినా దానిపై కన్నేసిన ఆశావహులు పలువురు. అధికార కూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, స్థానిక నాయకుల రాజకీయ బలం, కార్పొరేటర్ల మద్దతు, సామాజిక సమీకరణాలు, అధిష్ఠానం నిర్ణయం.. ఇవన్నీ కలిపి గుంటూరు మేయర్ ఎన్నికను ఆసక్తికర రాజకీయ పోరుగా మార్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే మేయర్ పీఠాన్ని ఎవరు దక్కించుకుంటారనే చర్చ టీ స్టాళ్ల నుంచి పార్టీ కార్యాలయాల వరకు సాగుతోంది. ఎవరి వెంట ఎంతమంది కార్పొరేటర్లు ఉన్నారు? ఎవరి వెనుక ఏ నాయకుడి అండ ఉంది? ఎవరికి ప్రజల్లో పట్టు ఉంది? ఎవరికి పార్టీ అధిష్ఠానం వద్ద పరిచయాలు ఉన్నాయి? అనే అంశాలపై ఆయా వర్గాలు తమదైన లెక్కలు వేసుకుంటున్నాయి. అయితే రాజకీయాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న లెక్కలన్నీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసరికి మారిపోయే అవకాశం ఉంది. రిజర్వేషన్ ఖరారు, ఎన్నికల విధానం, కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాతే అసలు పోరు స్వరూపం బయటపడనుంది.

### పీఠం ఒక్కటే.. పోటీ మాత్రం ముక్కోణం.?

గుంటూరు మేయర్ పీఠం విషయంలో అధికార కూటమిలోని మూడు ప్రధాన భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం కీలకంగా మారనుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల బరిలోకి దిగితే మేయర్ అభ్యర్థి ఎంపిక ఎవరి కోటాలోకి వెళ్తుందన్న ప్రశ్న మొదలవుతుంది. ఒకవైపు నగరంలో తమకు ఉన్న సంస్థాగత బలాన్ని ఆధారంగా చేసుకుని టీడీపీ మేయర్ పీఠంపై సహజంగానే ఆసక్తి చూపే అవకాశం ఉంది. మరోవైపు కూటమిలో తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని విస్తరించుకోవాలని భావించే జనసేన, బీజేపీలు కూడా తమ వాదనను వినిపించే అవకాశం ఉంది. మేయర్ పీఠం కేటాయింపు కేవలం ఒక పదవికి సంబంధించిన అంశం కాదు. నగర రాజకీయాల్లో భవిష్యత్ ఆధిపత్యానికి సంబంధించిన అంశం కావడంతో మూడు పార్టీల మధ్య సర్దుబాటు కీలకంగా మారనుంది.

### టీడీపీ వాటా ఎంత.?

గుంటూరు నగర రాజకీయాల్లో టీడీపీకి ఉన్న బలం, గత మేయర్ ఎన్నికలో కూటమి తరఫున అభ్యర్థి విజయం సాధించిన అంశం పార్టీకి రాజకీయంగా బలమైన వాదనను ఇస్తోంది. దీంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్ పీఠంపై తమ పార్టీకి ప్రాధాన్యం ఉండాలని టీడీపీ వర్గాలు భావించే అవకాశం ఉంది. అయితే గత ఫలితాలు మాత్రమే భవిష్యత్ ఎన్నికల ఫలితాలకు హామీ ఇవ్వవు.

వార్డు స్థాయిలో పార్టీ పరిస్థితి, అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకత్వం మధ్య సమన్వయం, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయం వంటి అంశాలు కూడా కీలకం. ముఖ్యంగా మేయర్ అభ్యర్థిని ముందుగానే ప్రకటిస్తారా.? లేక ఎన్నికల ప్రక్రియ తర్వాత సమీకరణాలను బట్టి నిర్ణయిస్తారా.? అన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

### జనసేనకు జోష్.. నగరంపై గురి.?

కూటమిలో జనసేన కీలక భాగస్వామిగా ఉన్న నేపథ్యంలో గుంటూరు నగర రాజకీయాల్లో తన ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుకునే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. స్థానిక సంస్థలు పార్టీకి క్షేత్రస్థాయి బలం పెంచుకునే వేదికగా మారవచ్చు. మేయర్ పీఠంపై నేరుగా పోటీ చేసే అవకాశం వస్తుందా? సీట్ల సర్దుబాటులో కీలక వార్డులు దక్కుతాయా? లేదా మిత్రపక్షానికి మద్దతు ఇచ్చే వ్యూహాన్ని అనుసరిస్తుందా? అన్నది కూటమి అంతర్గత చర్చలపై ఆధారపడి ఉంటుంది.

### బీజేపీ ఎత్తుగడలపై ఆసక్తి..

గుంటూరు మేయర్ పీఠంపై బీజేపీ దృష్టి సారించిందన్న ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు వచ్చింది. మాజీ వైసీపీ నేత, మాజీ మేయర్ కావటి మనోహర్ నాయుడిని బీజేపీలోకి తీసుకొచ్చి మేయర్ అభ్యర్థిగా రంగంలోకి దించే ఆలోచన ఉందన్న కథనాలు వెలువడ్డాయి.

అయితే దీనిపై అధికారికంగా తుది నిర్ణయం వెలువడనంతవరకు దీనిని రాజకీయ ప్రచారంగానే చూడాల్సి ఉంటుంది. అయినప్పటికీ బీజేపీ మేయర్ పీఠంపై ఆసక్తి చూపుతోందన్న చర్చ కూటమి రాజకీయాల్లో కొత్త లెక్కలకు తెరతీస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588